నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

తనువుగాయపడగ తర్వాత మానును
మనసు గాయ మైన మరచిపోరు
తూట కన్నజూడ మాటయే బాధించు
విజయలక్ష్మి వాక్కు వినుర నరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 170 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 16-9-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




# బీహార్ సర్ ప్రక్రియపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

- చట్టబద్ధత లోపిస్తే మొత్తం ప్రక్రియను రద్దు చేస్తాం
- కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం ధర్మాసనం హెచ్చరిక

**న్యూఢిల్లీ,**

అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ పక్రియపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం అనుసరించిన పద్ధతిలో ఏదైనా చట్టవిరుద్ధంగా జరిగితే మొత్తం సర్ పక్రియను రద్దు చేస్తామని ఈసీని హెచ్చరించింది. సర్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా సర్ పక్రియపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.రాజ్యాంగబద్ధ సంస్థ అయినా ఎన్నికల సంఘం బీహార్ సర్ పక్రియలో చట్టం, తప్పనిసరి నియమాలను పాటిస్తుందని తాము భావిస్తున్నామని ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేసింది. బీహార్ సర్ పక్రియపై ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని.. తుది తీర్పు దేశవ్యాప్త సర్ ప్రక్రియకు వర్తిస్తుందని పేర్కొంది. బిహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ఎన్నికల కమిషన్ -మిగతా 2 లో



# వీధి దీపాలకు సోలార్ పవర్

## పకడ్బందీగా వీధి దీపాల నిర్వహణ

- సోలార్ పవర్‌పై సాధ్యాసాధ్యాల పరిశీలన
- ఐఐటి సంస్థలతో ఆడిటింగ్ జరిపేలా చర్యలు
- పెద్ద కంపెనీల నుంచి టెండర్ల ఆహ్వానం
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం





**హైదరాబాద్, సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

వీధి దీపాల నిర్వహణ కోసం పెద్ద కంపెనీల నుంచి వెంటనే టెండర్స్ పిలవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జీహెచ్ఎంసీ అధికారులతో సీఎం రేవత్‌రెడ్డి సమిక్ష సమావేశం నిర్వహిచారు. ఈ సమావేశంలో అధికారులకు పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు. వీధి దీపాలకు సోలార్ పవర్‌ను వినియోగించడంపైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని మార్గనిర్దేశర చేశారు. -మిగతా 2 లో



# కవితతో విష్ణువర్ధన్ రెడ్డి భేటీ

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై మంతనాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మాజీ ఎమ్మెల్యే, దివంగత పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్ సెగ్మెంట్ ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో వీళ్లిద్దరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. పీజేఆర్ వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేసిన విష్ణువర్ధన్ రెడ్డి ఖైరతాబాద్ నుంచి 2008లో నిర్వహించిన ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తర్వాత 2009లో జూబ్లీహిల్స్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం -మిగతా 2 లో



# ఖతార్ విషయంలో జాగ్రత్త..

- అది మాకు మిత్రదేశం..
- నెతన్యాహుకు ట్రంప్ వార్నింగ్

**న్యూఢిల్లీ,**

ఖతార్ రాజధాని దోహా లో హమాస్ నేతలే లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానిక దళం గత వారం భీకర దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ దాడులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ మేరకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఖతార్ తమకు చాలా ముఖ్యమైన మిత్ర దేశమని చెప్పారు. ఖతార్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకున్నప్పుడు ఆచితూచి వ్యవహరించాలని ఇజ్రాయెల్‌ను హెచ్చరించారు. 'నెతన్యాహు.. ఖతార్ విషయంలో జాగ్రత్త. అది అమెరికాకు చాలా ముఖ్యమైన మిత్రదేశం. హమాస్‌పై ఎటువంటి చర్యలు తీసుకున్నప్పటికీ ఖతార్ జోలికి మాత్రం వెళ్లొద్దు. ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకున్నప్పుడు ఆచితూచి వ్యవహరించాలి' అని హెచ్చరించారు.గాజాలో కాల్పుల విరమణ కోసం అమెరికా చేసిన ప్రతిపాదనలపై చర్చించేందుకు గత వారం దోహాలో హమాస్ కీలక నేతలు సమావేశమయ్యారు. ఆసమయంలో -మిగతా 2 లో

# అమెరికాలో మళ్లీ టిక్‌టాక్..

- చైనాతో డీల్ కుదిరిందన్న ట్రంప్



**న్యూయార్క్**

టిక్‌టాక్ యాప్ మళ్లీ అమెరికాలో వాడనున్నారు. ఆ సోషల్ మీడియా యాప్ వాడకం గురించి చైనాతో డీల్ జరిగినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇవాళ వెల్లడించారు. టిక్‌టాక్ యాప్‌ను ఆపరేషనల్‌గా ఉంచేందుకు చైనా కంపెనీతో దాదాపు ఓ ఒప్పందం కుదిరినట్లు ఆయన చెప్పారు. టిక్‌టాక్ వ్యవహారం గురించి చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో శుక్రవారం చర్చలు జరపనున్నట్లు ట్రంప్ తెలిపారు. దేశంలోని యువత ఆ యాప్ కోసం ఆసక్తిగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. అమెరికా, ఈయూ, చైనా మధ్య జరిగిన వాణిజ్య భేటీపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.చైనాకు చెందిన టెక్నాలజీ కంపెనీ -మిగతా 2 లో



# మరో మూడ్రోజులు భారీ వర్షాలు

- వాతావరణశాఖ హెచ్చరిక

**హైదరాబాద్, సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణలో మరో మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, -మిగతా 2 లో

# ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం

## ఇన్ఫోసిస్ ఉద్యోగి మృతి



**హైదరాబాద్ సెప్టెంబర్ 15 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**

ఔటర్ రింగ్ రోడ్డు ఓఆర్ఆర్ పై కారు బోల్తా పడింది. ఈ ఘటనలో ఇన్ఫోసిస్ ఉద్యోగిని సౌమ్యారెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా మరో ఏడుగురికి గాయాలయ్యాయి. ఇన్ఫోసిస్ కంపెనీకి చెందిన వీరంతా సరళ మైసమ్మ ఆలయానికి వెళ్లి వస్తుండగా అబ్దుల్లాపూర్‌మెట్ ఓఆర్ఆర్ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.



# అమెరికాకు మాస్కో కౌంటర్

## భారత్-రష్యా మధ్య సంబంధాన్ని బలహీనపరిచే ఏ ప్రయత్నమైనా విఫలమవడం ఖాయం..

**న్యూఢిల్లీ,**

రష్యా చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గుర్రుగా ఉన్నారు. ఇప్పటికే భారత్‌పై అధిక సుంకాలు బాదిన ట్రంప్ ఈయూ, జీ-7 దేశాలపై కూడా ఒత్తిడి చేస్తున్నారు. భారత్ దిగుమతులపై అమెరికా తరహాలోనే అధిక సుంకాలు విధించాలని ఆయా దేశాలకు సూచిస్తున్నారు. ఇందుకు జీ-7 సభ్య దేశాలు కూడా సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. ఈ పరిణామాలపై మాస్కో తీవ్రంగా స్పందించింది. అగ్రరాజ్యం అమెరికాకు కౌంటర్ ఇచ్చింది.అమెరికా తరహాలోనే ఇతర దేశాలు కూడా భారత్‌పై టారిఫ్‌లు విధించాలని ట్రంప్ ఒత్తిడి తెస్తున్నప్పటికీ ఢిల్లీతో తమ సంబంధం స్థిరంగా కొనసాగుతుందని వ్యాఖ్యానించింది. 'ఢిల్లీ-మాస్కో మధ్య సంబంధాలు స్థిరంగా, నమ్మకంగా ముందుకు సాగుతున్నాయి. దానిని బలహీనపరిచే ఏ ప్రయత్నమైనా విఫలమవడం ఖాయం. అమెరికా, నాటో దేశాల ఒత్తిడిని ఎదుర్కొంటూ రష్యా చమురు కొనుగోలు కొనసాగిస్తున్నందుకు భారత్‌ను అభినందించాల్సిందే. బాహ్య బెదిరింపులు, విమర్శలు ఉన్నా, ఇండియా తన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగిస్తోంది' అని రష్యా విదేశాంగ శాఖ ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ప్రకటనలో పేర్కొంది.ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు రష్యాపై ఒత్తిడి తేవడమే సరైన మార్గమని అమెరికా భావిస్తున్నది. ఇందులో భాగంగానే రష్యా మిత్ర దేశమైన భారత్‌పై భారీగా సుంకాలు విధించటం ద్వారా ఒకరకంగా -మిగతా 2 లో

# బండి సంజయ్‌పై కేటీఆర్ 10 కోట్ల పరువు నష్టం దావా

## సిటి సివిల్ కోర్టులో పిటిషన్ వేసిన కేటీఆర్

- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నిరాధార ఆరోపణలు చేయడంతో పిటిషన్
- ఆగస్టు 8న బండి సంజయ్ తప్పుడు, అసభ్యకరమైన వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్





**హైదరాబాద్,సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కేంద్రమంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరువు నష్టం దావా వేశారు. బండి సంజయ్‌తో పాటు పలు మీడియా సంస్థలు, సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లపై హైదరాబాద్ సిటి సివిల్ కోర్టులో పిటిషన్ వేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నిరాధార ఆరోపణలు చేయడంతో పాటు తప్పుడు కథనాలను ప్రచురించినందుకు కేటీఆర్ ఈ దావా వేశారు. తప్పుడు సమచారాన్ని తొలగించడంతో పాటు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారంగా రూ.10 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.2025 ఆగస్టు 8న బండి సంజయ్ తప్పుడు, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారని కేటీఆర్ తన పిటిషన్‌లో -మిగతా 2 లో

# ఫీజు రియంబర్స్‌మెంట్‌పై సర్కార్ పరిశీలన

## సీఎం రేవంత్‌తో భట్టి, శ్రీదర్ బాబుల సమీక్ష



**హైదరాబాద్, సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఫీజు రియంబర్స్‌మెంట్‌పై కాలేజీ యాజమాన్యాల తీరుపై ప్రభుత్వం ఆగ్రహంగా ఉంది. కాలేజీల బంద్‌తో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబులు సిఎం రేవంత్‌తో చర్చించారు. ఈ క్రమంలో తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. ఈ విషయంలో సీఎం ఏ.రేవంత్ రెడ్డి, డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు కలిసి కీలకంగా చర్చించారు. ప్రభుత్వానికి అందిన -మిగతా 2 లో

# ఫీజు రియంబర్స్‌మెంటులో ఇంత నిర్లక్ష్యమా?

## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఎంపి ఈటెల



**హుజూరాబాద్**

తెలంగాణలోని ఇంజినీరింగ్ కళాశాలలకు గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వమే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తోందని అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని మధువని గార్డెన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణలో -మిగతా 2 లో

# వీధి దీపాలకు సోలార్ పవర్

(మొదటి తరువాయి)

రాష్ట్రంలోని అన్ని వీధిదీపాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని ఆదేశించారు. ఏఐతో ఎప్పటికప్పుడు విశ్లేషణ చేయాలని సూచించారు. గ్రామాల్లో వీధిదీపాల నిర్వహణను గ్రామ పంచాయతీకి అప్పగించాలని మార్గనిర్దేశర చేశారు . రాష్ట్రంలో వీధిదీపాల ఏర్పాటు-, నిర్వహణలో సమూల మార్పులు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేమ నరేందర్‌రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, కోర్ అర్బన్ ఏరియా మున్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో పాటు- అనేక ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో వీధిదీపాల ఏర్పాటు-, నిర్వహణ కోసం పెద్ద కంపెనీల నుండి -టె-ండర్లను పిలవాలని సూచించారు. దీనివల్ల పారదర్శకత పెరిగి, సేవల నాణ్యత మెరుగుపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే, వీధిదీపాల కోసం సౌరశక్తి వినియోగం సాధ్యాసాధ్యాలను లోతుగా పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వీధిదీపాల పనితీరును నిర్ధారించడానికి ఐఐటీ- వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సీఎం ఆదేశించారు. అంతేకాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని వీధిదీపాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేసి, కేంద్రంగా పర్యవేక్షించే విధానాన్ని రూపొందించాలని సూచించారు. దీని ద్వారా ప్రతి దీపం స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. వీధిదీపాల నిర్వహణలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. కృత్రిమ మేధస్సు ద్వారా ఎప్పటికప్పుడు విశ్లేషణ జరిపి, సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కారాలు తీసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో వీధిదీపాల నిర్వహణను పూర్తిగా గ్రామపంచాయతీలకే అప్పగించాలని నిర్ణయించారు. సర్పంచ్‌లకు దీపాల ఏర్పాటు-, నిర్వహణపై పూర్తి అధికారం ఇవ్వబడుతుంది. అయితే, ఈ పనులపై ఎంపీడీవో స్థాయిలో పర్యవేక్షణ ఉండాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి వీధిదీపం, ప్రతి పోల్‌పై సర్వే చేయాలని సీఎం ఆదేశించారు. దీని ద్వారా సమస్యలు, లోపాలు, అదనపు అవసరాలను గుర్తించి త్వరితగతిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటు-ందని అన్నారు. వీధిదీపాల వ్యవస్థను ఆధునీకరించడానికి తీసుకుంటున్న ఈ చర్యలు రాబోయే రోజుల్లో రాష్ట్రానికి ఒక మోడల్‌గా నిలుస్తాయని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. పారదర్శక విధానాలు, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, గ్రామీణ స్థాయి అధికారానికి బాధ్యత కల్పించడం ద్వారా వీధిదీపాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించగలమన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

# బండి సంజయ్‌పై కేటీఆర్ 10 కోట్ల పరువు నష్టం దావా

(మొదటి తరువాయి)



పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలలో తెలంగాణ ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్) దుర్వినియోగం, ఫోన్ ట్యాపింగ్. ఆర్థిక అవకతవకలకు ముడిపెట్టారని తెలిపారు. ఏబీఎన్ తెలుగు, ఎన్టీవీ, టీవీ5, వీ6, ఏఎన్ఎన్ తెలుగు వంటి టీవీ ఛానెళ్లు, అలాగే ఇండియా టుడే, ఎన్డీటీవీ, డెక్కన్ హెరాల్డ్, టైమ్స్ ఆఫ్ ఇండియా వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, అలాగే ఎక్స్ (ట్విట్టర్), యూట్యూబ్, గూగుల్, మెటా (ఫేస్‌బుక్/ఇన్‌స్టాగ్రామ్) వంటి సోషల్ మీడియా సంస్థలు ఈ వ్యాఖ్యలను విస్తృతంగా ప్రసారం చేశాయన్నారు. ఈ వ్యాఖ్యలు కేవలం పరువుకు భంగం కలిగించడమే కాకుండా, తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడానికి ఉద్దేశించినవిగా ఉన్నాయని తెలిపారు. ఈ ఆరోపణలపై 2025 ఆగస్టు 11న లీగల్ నోటీసు పంపినప్పటికీ, బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పడానికి నిరాకరించారని.. అందుకే న్యాయస్థానాన్ని ఆశ్రయించానని పిటిషన్‌లో కేటీఆర్ పేర్కొన్నారు. బండి సంజయ్ కేవలం రాజకీయ కక్షతో "విపరీతమైన నిందారోపణలతో దుష్ప్రచారానికి" పాల్పడ్డారని తెలిపారు. అధికారంలో ఉన్న కేంద్ర మంత్రి ఇటువంటి బాధ్యతారహితమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రజా ప్రతినిధుల విశ్వసనీయత, గౌరవానికి తీవ్రమైన పరిణామాలు ఉంటాయని కూడా ఈ ఫిర్యాదులో నొక్కి చెప్పారు. నిరాధార ఆరోపణలపై బండి సంజయ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పిటిషన్‌లో కేటీఆర్ డిమాండ్ చేశారు. మరోసారి తన పరువుకు నష్టం కలిగించే కంటెంట్‌ను ప్రచురించకుండా, ప్రసారం చేయకుండా నిందితులను నిరోధించేలా ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు, మీడియా పోర్టల్స్‌లో ప్రచురించిన కథనాలు, వీడియోలు, పోస్టులను తక్షణమే తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

# ఫీజు రియంబర్స్‌మెంటులో ఇంత నిర్లక్ష్యమా?

(మొదటి తరువాయి)



రూ.9 వేల కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నట్లు చెప్పారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం వల్ల చాలా నష్టం జరుగుతోందని ఆరోపించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీ విద్యార్థులకు వందశాతం రీయింబర్స్‌మెంట్ ఇస్తామని హామీ ఇచ్చి.. పాత విధానంలోనూ రీయింబర్స్‌మెంట్ చేయలేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారినప్పుడు పాత బకాయిలు కూడా చెల్లించాల్సిందేనని అన్నారు. తన రాజకీయ జీవితంలో ఇంత బాధ్యత లేని ప్రభుత్వాన్ని చూడలేదు. సమస్యలు పరిష్కరించకపోతే.. ప్రజాగ్రహానికి గురికాక తప్పదు. రాష్ట్రానికి కావాల్సిన యూరియాను ఒక సంవత్సరం ముందు నిల్వ చేసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే రాష్ట్రంలో యూరియా కొరత తలెత్తింది. కేంద్ర ప్రభుత్వంపై నెపం నెట్టకుండా ఎరువులు వచ్చే మార్గంపై దృష్టి పెట్టాలని ఈటల సూచించారు.

# అమెరికాకు మాస్కో కౌంటర్

(మొదటి తరువాయి)



మాస్కోపై చర్యలు తీసుకున్నట్టేనని అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నారు. అందులో భాగంగా ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలను లక్ష్యంగా చేసుకోవాలని చూస్తున్నది. ఈ క్రమంలో ఈయూ, జీ-7 దేశాలు భారత్, చైనాలపై సుంకాలు విధించాలని ట్రంప్ పాలకవర్గం ప్రతిపాదనలు చేసింది. ఇందుకు జీ-7 సభ్య దేశాలు కూడా సానుకూలంగా స్పందించినట్టు తెలుస్తున్నది.

# ఫీజు రియంబర్స్‌మెంట్‌పై సర్కార్ పరిశీలన

(మొదటి తరువాయి)

సమాచారం ప్రకారం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో సిద్ధమైన విజిలెన్స్ రిపోర్ట్‌ను తిరిగి పరిశీలించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ రిపోర్ట్‌లో అనేక ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని లాభాల కోసం వినియోగించు కున్నట్లు- స్పష్టంగా తేలినట్టు- తెలుస్తోంది. విద్యార్థి సంఘాలు కూడా ఈ రిపోర్ట్‌ను వెంటనే బహిర్గతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. కాలేజీలు విద్యా ప్రమాణాలను విస్మరించి బకాయిల చెల్లింపుల పేరుతో ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయంటూ విద్యార్థి సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. నకిలీ సిబ్బందిని చూపించి అనుమతులు పొందడం, సౌకర్యాలు కల్పించకుండా కోట్లు- దాచుకోవడం, తనిఖీలు తూతూమంత్రంగానే జరగడం వంటి అంశాలను వారు ప్రస్తావిస్తున్నారు. అంతేకాకుండా, కోట్ల రూపాయల నిధులు కాలేజీ యాజమాన్యాల మధ్య చేతులు మారుతున్నాయంటూ ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విజిలెన్స్ రిపోర్ట్‌ను సమగ్రంగా పరిశీలిం చేందుకు సిద్ధమవుతోంది. అవసరమైతే అక్రమాలకు పాల్పడిన కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవచ్చని సంకేతాలు ఇస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుల చర్చలు ఈసారి ఎటువంటి నిర్ణయానికి దారితీస్తాయో విద్యార్థులు, కాలేజీలు, తల్లిదండ్రులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

# విద్యార్థులకు 75% హాజరు తప్పనిసరి

## 10, పన్నెండో తరగతులకు సీబీఎస్ఈ కొత్త నిబంధనలు



**న్యూఢిల్లీ - సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పదో తరగతి, పన్నెండో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అర్హత నిబంధనలను సీబీఎస్ఈ కఠినతరం చేసింది. పరీక్షలు రాయడానికి అర్హత పొందాలంటే విద్యార్థులు కనీసం 75 శాతం తరగతులకు హాజరై ఉండాలని తెలిపింది. విద్యాపరమైన, హాజరుకు సంబంధించిన నిబంధనలను నెరవేర్చని విద్యార్థులను పరీక్షలకు అనుమతించేది లేదని స్పష్టం చేసింది. పదో తరగతి, పన్నెండో తరగతి రెండేళ్ల ప్రోగ్రామ్స్ అని పేర్కొంది.విద్యార్థి పాఠశాలకు హాజరుకాకపోతే, అతని ఇంటర్నల్ అసెస్‌మెంట్ జరగదని తెలిపింది. ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లో పనితీరు కనబరచకపోతే, ఆ విద్యార్థి పరీక్షల ఫలితాన్ని ప్రకటించేది లేదని పేర్కొంది. అలాంటి విద్యార్థులను ఎసెన్షియల్ రిపీట్ క్యాటగిరీలో పెట్టనున్నట్లు వివరించింది. అనుమతి లేకుండా సబ్జెక్టులను ఆఫర్ చేయవద్దని అనుబంధ పాఠశాలలను సీబీఎస్ఈ హెచ్చరించింది.

# బీహార్ సర్ ప్రక్రియపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

(మొదటి తరువాయి)

అనుసరించిన పద్ధతిలో ఏదైనా చట్టవిరుద్ధంగా కనిపిస్తే మొత్తం 'ఎస్ఐఆర్'ను రద్దు చేస్తామని సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌ను హెచ్చరించింది. అయితే రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణలో సరైన నిబంధనలను పాటించిందని భావిస్తున్నట్లు పేర్కొంది. బిహార్‌లో ఈసీ చేపట్టిన ఓటరు జాబితా సర్వేకు వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యాన్ని విచారించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం ఈ విషయంపై తాము అసంపూర్తి అభిప్రాయాలు వెల్లడించలేమని..అక్టోబర్ 7న తుది వాదనలు విన్న తర్వాత తీర్పును వెలువరిస్తామని అత్యున్నత న్యాయస్తానం స్పష్టం చేసింది. బిహార్ సమగ్ర ప్రత్యేక సవరణలో ఆధార్‌ను కూడా కచ్చితంగా గుర్తింపు కార్డుగా పరిగణించాలని ఇటీవల సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌కు మార్గదర్శకాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ముందస్తు సూచనలు ఉన్నప్పటికీ ఎన్నికల అధికారులు ఆధార్‌ను గుర్తింపు కార్డుగా అంగీకరించడానికి నిరాకరిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో న్యాయస్థానం ఎన్నికల కమిషన్ చూపిస్తున్న అభ్యంతరాలను తోసిపుచ్చింది. ఆధార్ పౌరసత్వాన్ని నిరూపించలేక పోయినప్పటికీ.. అది ప్రజల గుర్తింపుకు చట్టబద్ధమైన రుజువుగా మిగిలిపోయిందని స్పష్టం చేసింది. కాగా బిహార్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఓటరు జాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ' పేరిట భాజపాతో కలిసి ఓట్ల చోరీకి ప్రయత్నిస్తోందని విపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. గత కొన్నేళ్లుగా దేశంలో జరుగుతున్న అన్ని ఎన్నికల్లో ఇదే విధంగా ఓట్ల చోరీ జరిగిందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు.

# ఖతార్ విషయంలో జాగ్రత్త..

(మొదటి తరువాయి)

హమాస్ నేతలపై 'సమ్మిట్ ఆఫ్ ఫైర్' పేరుతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. . ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం ఈ దాడికి బాధ్యత వహించింది. హమాస్ అగ్రశ్రేణి ఉగ్రవాద నాయకులపై నేటి చర్య పూర్తిగా స్వతంత్ర ఆపరేషన్ అని.. ఇజ్రాయెల్ ఈ ఆపరేషన్‌ను ప్రారంభించి.. నిర్వహించిందని.. దీనికి ఇజ్రాయెల్ పూర్తి బాధ్యత వహిస్తుందని పీఎం కార్యాలయం పేర్కొంది.ఖతార్ స్టేట్ ప్రసార సంస్థ అల్ జజీరా దాడులను ధ్రువీకరించింది. ఈ క్రమంలోనే తమ వైమానిక దళం హమాస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడి చేసిందని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. హమాస్ ప్రతినిధి ఖలీల్ అల్-హయ్యా ఈ దాడిలో చనిపోయాడని అల్ అరేబియా తెలిపింది. ఇజ్రాయెల్ దాడిని ఖతార్ తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిచర్య అని, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని మండిపడింది. ఇజ్రాయెల్ అనాలోచిత చర్యలను సహించబోమని హెచ్చరించింది.

# కవితతో విష్ణువర్దన్ రెడ్డి భేటీ

(మొదటి తరువాయి)

సాధించారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన విష్ణు ఓటమి చెందారు. అప్పుడు దివంగత గోపీనాథ్ బీఆర్ఎస్ తరపున విజయం సాధించారు. 2023 అసెంబ్లీ ఎన్నికలలో మరోసారి టికెట్ ఆశించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ నిరాకరించడంతో ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్‌కు రాజీనామా చేసి కేసీఆర్‌ను కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ లో చేరినప్పటికీ రాజకీయంగా మాత్రం అంత చురుకుగా ఉండటం లేదు. మాగంటి మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నికలు రావడంతో బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న విష్ణును కవిత కలుసుకోవడం ఆసక్తిగా మారింది. వీళ్లిద్దరి మధ్య ఉప ఎన్నికపైనే ప్రధానంగా చర్చ జరిగినట్టు- సమాచారం. మీటింగ్ తర్వాత బయటికి వచ్చిన విష్ణు మీడియాతో మాట్లాడారు. తాను కేటీ-ఆర్ వెంటే ఉంటానని, పెద్దమ్మ ఉత్సవాలకు ఆహ్వానించేందుకు మాత్రమే కవిత ఇంటికి వెళ్లినట్టు- చెబుతున్నారు. అనంతరం జరిగిన వెంగళరావ్ నగర్ డివిజన్ సమావేశంలోనూ విష్ణు పాల్గొన్నారు.

# అమెరికాలో మళ్లీ టిక్‌టాక్..

(మొదటి తరువాయి)

బైట్‌డ్యాన్స్.. టిక్‌టాక్ యాప్‌ను డెవలప్ చేసింది. ఆ యాప్ చాలా వరకు దేశాల్లో పాపులరైంది. చైనా వ్యాపారవేత్త జాంగ్ యిమింగ్ 2021లో బైట్‌డ్యాన్స్ కంపెనీని స్థాపించారు. దీని ప్రధాన కార్యాలయంలో బీజింగ్‌లోని హైదియాన్ జిల్లాలో ఉన్నది. కోవిడ్19 సమయంలో టిక్‌టాక్ యాప్‌కు ఫుల్ క్రేజీ వచ్చింది. ఆ యాప్‌లో వీయోలన్నీ వైరల్ అయ్యాయి. దీంతో ఆ యాప్‌కు కౌంటర్‌గా యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ కూడా షార్ట్ వీడియోలను రిలీజ్ చేశాయి. రీల్స్, షార్ట్స్ పేరుతో ఆ వీడియోలు కూడా ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# మరో మూడ్రోజులు భారీ వర్షాలు

(మొదటి తరువాయి)



మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని.. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. బుధవారం సిద్దిపేట, రంగారాఎడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు కురిసే అవకాశం ఉందని వివరించింది.ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్‌తో పాటు- పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట గ్రామంలో 24.5 సెంటీ-మీటర్ల వర్షపాతం నమోదైంది.

## 2025 సెప్టెంబర్ 16, మంగళవారం




మాసం - పక్షం
భాద్రపద మాసం, కృష్ణ పక్షం
తిథి
శుక్లపక్ష దశమి: సెప్టెంబర్ 16 రాత్రి 1:31 AM నుండి సెప్టెంబర్ 17 రాత్రి 12:22 AM వరకు
శుక్లపక్ష ఏకాదశి: సెప్టెంబర్ 17 రాత్రి 12:22 AM నుండి సెప్టెంబర్ 17 రాత్రి 11:39 PM వరకు
నక్షత్రం
ఆర్ద్ర: సెప్టెంబర్ 15 ఉదయం 7:31 AM సెప్టెంబర్ 16 ఉదయం 6:46 AM
పునర్వసు: సెప్టెంబర్ 16 ఉదయం 6:46 AM సెప్టెంబర్ 17 ఉదయం 6:26 AM
శుభ సమయాలు
అమృతకాలం: ఉదయం 4:04 AM - 5:38 AM
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:46 AM - 12:35 PM
అశుభ సమయాలు
రాహుకాలం: సాయంత్రం 3:12 PM - 4:43 PM
యమగండం: ఉదయం 9:09 AM - 10:40 AM
వర్జ్యం: సాయంత్రం 6:36 PM - 8:10 PM
గులికా: మధ్యాహ్నం 12:10 PM - 1:41PM

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### నిజాంపేట్ మెయిన్ రోడ్‌లో నీటి పైపుల లీకేజీ పనులను పరిశీలించిన కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు



**హైదర్‌నగర్, సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ మెయిన్ రోడ్, పాత ముంబయి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో జరుగుతున్న నీటి ప్రధాన పైపు లీకేజీ మరమ్మతుల పనులను హైదరాబాద్ మేట్రో వాటర్ సరఫరా, మురుగు నీటి మండలి (హెచ్‌ఎండబ్ల్యూఎస్–ఎస్‌బీ) ట్రాన్స్మిషన్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు గౌరవ కార్పొరేటర్ శ్రీ నార్నె శ్రీనివాస రావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ"గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా లీకేజీ పైపు మరమ్మతులు చేపట్టలేకపోయాం. ప్రస్తుతం అత్యవసరంగా పనులు ప్రారంభించాం. ప్రజల సమస్యల పరిష్కారమే మా ప్రధాన ధ్యేయం. సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ప్రతి ఒక్కరు డివిజన్ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి. ప్రజల సమిష్టి కృషితో ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం" అని తెలిపారు. అలాగే, "ఏ చిన్న సమస్య అయినా నా దృష్టికి తీసుకురావాలి. పరిష్కారం కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉంటాను. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం" అని కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ ట్రాన్స్మిషన్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీ వివేక్, పనుల పరిశీలకుడు శ్రీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి సాధ్యం

### నర్సాపూర్‌లో రైతులకు అవగాహన కల్పించిన కూనారం శాస్త్రవేత్త సతీష్ చంద్ర



**ఎలిగేడు, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వ్యవసాయ రంగంలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని కూనారం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త సతీష్ చంద్ర తెలిపారు. సోమవారం నర్సాపూర్ గ్రామంలో రైతులకు వరి పంటలో పాటించవలసిన జాగ్రత్తలు, సస్యరక్షణ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ"కాండం తొలుచు పురుగుల నియంత్రణ కోసం లింగాకర్షక బుట్టలను ఎకరానికి నాలుగు చొప్పున 25 మంది రైతులకు పంపిణీ చేశాం. మగ రెక్కల పురుగులు బుట్టల్లో కనిపించిన వెంటనే పురుగుమందులు పిచికారి చేయాలి. అలాగే వేప నూనెను కూడా పంపిణీ చేశాం. ఇది సస్యరక్షణకు సహాయపడుతుంది" అని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఉమాపతి, సొసైటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, ఏఈఓ గణేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి వైపు యువత అడుగులు

### కాళ్లకల్‌లో హైడ్రాలిక్ ఫోమ్ వాషింగ్ సెంటర్ ప్రారంభం




**కాళ్లకల్, సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పట్టణంలోని హైడ్రాలిక్ ఫోమ్ వాషింగ్ సెంటర్‌ను అనిల్ యాదవ్, దుర్గేష్ యాదవ్, మహ్మద్ అబిద్ అన్సారీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు నత్తి మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ"యువత తల్లిదండ్రులు లేదా ప్రభుత్వాల మీద ఆధారపడకుండా స్వయం ఉపాధి కోసం ఇలాంటి పనులను ఎంచుకోవాలి. సొంత కాళ్లపై నిలబడే దిశగా ముందుకు సాగాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పురం మహేష్, నత్తి బాలరాజు, కాంగ్రెస్ నాయకులు వీరబోయిన గోపాల్, ఎల్. శ్రీనివాస్ గౌడ్, తుమ్మల రాజు యాదవ్, డిఎన్. రాజు, కనిగిరి రవి కుమార్, రవీందర్ రెడ్డి, మహేష్ యాదవ్, సిమెంట్ నవీన్, విజయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి

### చేపల విక్రయ సంచార వాహనం ప్రారంభించిన పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణ రావు




**ఎలిగేడు, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణ రావు తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ఓదెల మండలంలోని గూడెం గ్రామానికి చెందిన చిట్ల అర్చనకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 లక్షల విలువైన చేపల విక్రయ సంచార వాహనాన్ని 60 శాతం సబ్సిడీతో మంజూరు చేసింది.
ఈ వాహనాన్ని సోమవారం ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలోని తన నివాసం వద్ద రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ"చేపల సంచార వాహనం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. సరఫరా సులభతరం అవుతుంది. ఆర్డర్ ఇచ్చిన చోటకే నేరుగా చేపలు తీసుకెళ్లే అవకాశం ఈ వాహనం కల్పిస్తుంది. నాణ్యమైన చేపలు లబ్ధిదారులకు చేరుతాయి" అని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం మత్స్య రంగానికి, ముదిరాజ్ కులస్తులకు పెద్దపీట వేస్తుందని, డిఆర్డిఏ ద్వారా అనేక వ్యాపార అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఒక్కరూ వాటిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్ శ్రీనివాస్, డిఆర్డిఏ అధికారి రవి, మత్స్య శాఖ అధికారి నరేష్, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రేషన్ డీలర్లు

### ఎలిగేడు తహసీల్దార్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం



**ఎలిగేడు, సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మండల పరిధిలోని రేషన్ డీలర్లు తహసీల్దార్ యాకన్న, డిప్యూటీ తహసీల్దార్ సిరిపురం గిరిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల జిల్లా నాయకుడు వేల్పూరి అశోక్ రావు, మండల రేషన్ డీలర్లు దేవర్నేని నరేందర్ రావు, అయిట్ల రమాదేవి, శ్రీనివాస్, శ్యామల బాపు, సరిత రవీందర్ రెడ్డి, తిరుపతి, సమ్మయ్య, లక్ష్మీరాజం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టల్స్‌ను గాలికి వదిలేసిన ప్రభుత్వం

### తక్షణమే మెస్, కాస్మొటిక్ బిల్లులు విడుదల చేయాలని బిఆర్‌ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్



**దేవరకొండ, సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ హాస్టల్స్‌ను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వదిలేసిందని బిఆర్‌ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ తీవ్రంగా విమర్శించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా మెస్, కాస్మొటిక్ బిల్లులు విడుదల చేయకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. "హాస్టల్స్‌లో వార్డెన్లు ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉండకుండా, నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. కలుషిత ఆహారం తిని విద్యార్థులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం మాత్రం పట్టించుకోకుండా మొద్దునిద్రలో ఉంది" అని బొడ్డుపల్లి కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, "మెను సక్రమంగా పాటించని, విద్యార్థులకు అందుబాటులో లేని వార్డెన్లను తక్షణమే సస్పెండ్ చేయాలి. ప్రభుత్వ హాస్టల్స్ అద్వానంగా మారుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో వెలుగొందిన హాస్టల్స్ నేడు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మసకబారుతున్నాయి. మౌలిక వసతుల కల్పనకు తక్షణ చర్యలు చేపట్టాలి" అని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును నిర్లక్ష్యం చేయకుండా, సంక్షేమ హాస్టల్స్‌ను పునరుద్ధరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్వీ నాయకులు కోరుతున్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

### ఆమనగల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం




**ఆమనగల్, సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆదేశానుసారంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, రామ్ రెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆమనగల్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య ఆరోగ్య శిబిరాన్ని క్లబ్ కార్యదర్శి గంప శ్రీనివాసులు ప్రారంభించారు. నిరుపేదలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. ప్రజలు ఈ శిబిరాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో కంటి వైద్యురాలు డాక్టర్ ఏ. జ్యోతి ఆధ్వర్యంలో 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 15 మందిని ఐఓఎల్ ఆపరేషన్ కోసం రామ్ రెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్‌కు తరలించినట్లు క్లబ్ పి.ఆర్.ఓ పాషా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు మైమునా బేగం, హెల్త్ సూపర్వైజర్ తిరుపతి రెడ్డి, క్లబ్ సభ్యులు కర్నాటి కొండల్ రెడ్డి, పాండు, జాంగిర్ అలీ, దాసు, మహేష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పగలేమో బొంతల పని... రాత్రి దొంగతనాలు

**వనపర్తి సెప్టెంబర్ 15( నీలగిరి ఎక్స్ ప్రెస్ న్యూస్ ):**
పగలిపూట బొంతలు కుట్టే వ్యాపారం పేరుతో సంచరిస్తూ, రాత్రి వేళల్లో ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఆరుగురు సభ్యులను పట్టుకున్న పోలీసులు వారి వద్ద నుంచి రూ. 25 వేలు నగదు, 25 గ్రాముల బంగారం, 43 తులాల వెండి, ఓమ్ని వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన ఈ దొంగలు పెద్దగూడెం తండాలో బాణావత్ ప్రసాద్ ఇంట్లో తాళం పగలగొట్టి రూ. 1.20 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులను అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపినట్లు వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.



# బావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**



**ఎలిగేడు, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని మండల విద్యాశాఖ అధికారి నరేంద్ర చారి, ఎంపీడీవో భాస్కరరావు పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, సమగ్ర శిక్షణా, హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు మండల స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు సుల్తాన్‌పూర్ గ్రామంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎలిగేడు ప్రభుత్వ పాఠశాల నుండి జె. సత్యనారాయణ, కే. వెంకటేశ్వర్లు, కే. ప్రణయ్, బి. లావణ్యబీ దూళికట్ట స్కూల్ నుండి బి. చంద్రశేఖర్, సిహెచ్. బాబు, ఎం. యుగేందర్‌బీ సుల్తాన్‌పూర్ పాఠశాల నుండి బి. బాలకృష్ణబీ నర్సాపూర్ నుండి పి. వెంకటేశ్వర రెడ్డిబీ రాములపల్లె నుండి జి. శ్రీవాణిబీ శివపల్లె స్కూల్ నుండి ఏ. అనితబీ ర్యాకాల్ దేవ్‌పల్లె నుండి పి. సుధాకర్‌బీ ముప్పిరి తోట నుండి కే. స్వప్న లను ఘనంగా సన్మానించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఆధునిక సాంకేతిక విద్యా విధానాలను అందిపుచ్చుకొని విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్‌పూర్ పాఠశాల ఏఏపిసి చైర్మన్ సిరికొండ భాగ్యలక్ష్మి, మాజీ గ్రామ సర్పంచ్ ఏ. వెంకటేశ్వర్ రావు, మండల ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు కె. కుమారస్వామి, గంగారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, కిరణ్ కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్లు పెంచకపోతే కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధమే

**మంచాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట విహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో ముట్టడి**



**మంచాల, సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పెన్షన్లు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన ముట్టడిలో విహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ“ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు రూ.6000, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులకు రూ.4000 పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ నేటికి 22 నెలలు గడుస్తున్నా పెన్షన్లు పెంచలేదు. ఇది ప్రజలతో చేసిన మోసం” అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘ఇప్పటివరకు దరఖాస్తు చేసినవారికి సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పెన్షన్లు మంజూరు చేయాలి. స్థానిక సంస్థల ఎన్నికల లోపు పెన్షన్లు పెంచకపోతే, పెన్షన్‌దారుల సత్తా ఏంటో చూపిస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం పై యుద్ధానికి సిద్ధంగా ఉన్నాం” అని హెచ్చరించారు. “పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి ప్రతి నెల ఒకటో తారీఖునే పెన్షన్లు ఇస్తున్నాడు. రేవంత్ రెడ్డి కూడా ఆయనను చూసి నేర్చుకోవాలి. ఇప్పటికైనా పెన్షన్లు పెంచాలి” అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పిఎస్ మంచాల మండల అధ్యక్షుడు అశ్వాల బాలరాజ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పల్నాటి సుధాకర్ మాదిగ, సీనియర్ నాయకులు జంగయ్య, చీర దానయ్య, చేయూత పింఛన్దారుల హక్కుల పోరాట సమితి నాయకురాలు రావుల అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌ను కలిసిన అచ్చంపేట బీఆర్ఎస్ నాయకులు

**ఈనెల 28న భారీ బహిరంగ సభపై చర్చ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు ఈరోజు తెలంగాణ భవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావును కలిశారు. సీనియర్ నాయకులు పోకల మనోహర్, తులసిరాం నాయక్, నరసింహ గౌడ్, యూత్ ప్రెసిడెంట్ కోర్ర వంశి నాయక్, కౌన్సిలర్ సుల్తాన్‌తో పాటు అన్ని మండలాల నాయకులు సమావేశంలో పాల్గొన్నారు. ఈనెల 28న అచ్చంపేటలో జరగబోయే భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై కేటీఆర్‌తో చర్చించారు. భవిష్యత్తులో పార్టీ చేపట్టబోయే కార్యక్రమాలపై స్పష్టత ఇచ్చిన కేటీఆర్“ఎవ్వరూ అధైర్యపడొద్దు. కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా ముందుకు సాగాలి. పార్టీ విజయానికి మీ పాత్ర కీలకం” అని ధైర్యం కలిగించారు. సమావేశంలో నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలోపేతం, ప్రజలతో సంబంధం, కార్యకర్తల చైతన్యం వంటి అంశాలపై చర్చ జరిగింది.

# సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

**కలెక్టర్ ద్వారా ప్రధానమంత్రికి తపస్ వినతి పత్రం**







**రంగారెడ్డి, సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
2010 సంవత్సరానికి ముందు ఉపాధ్యాయ వృత్తిలో చేరిన వారికి ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుండి మినహాయింపు ఇవ్వాలని తపస్ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ప్రధానమంత్రికి మెమోరాండం పంపించారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఇటీవల ఇచ్చిన తీర్పు ప్రకారం, ఐదేళ్లకన్నా ఎక్కువ సేవలో ఉన్న ఉపాధ్యాయులు టెట్ అర్హత కలిగి ఉండాలి. అయితే 2010కు ముందు ఉద్యోగంలో చేరిన వారికి నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) మినహాయింపు ఇచ్చిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని సీనియర్ ఉపాధ్యాయులకు ఉపశమనం కల్పించాలని తపస్ రాష్ట్ర శాఖ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు కానుగంటి హన్మంత్ రావు, జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశి రావు, ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ్, గౌరవ అధ్యక్షుడు ఘణపురం సురధీర్, రాష్ట్ర బాధ్యులు శ్రీహరి కృష్ణ, యుగంధర్ రెడ్డి, జిల్లా బాధ్యులు మోర లక్ష్మణ్, శ్రీనివాస్ రెడ్డి, మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు జింకల వెంకటేష్, రత్నా రెడ్డి, రావుల శివ కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ యువకులు కాంగ్రెస్‌లోకి చేరిక

**ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో పార్టీలో చేరిక**



**అచ్చంపేట, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం కొర్ర తండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన యువకులు ఈ రోజు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి సాధారణంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నరసయ్య యాదవ్, మాజీ ఎంపీపీ రామనాథం, మంత్రియ నాయకు, ఇతర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ పనులపై సమీక్ష

**అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అధికారులకు సూచనలు**



**అచ్చంపేట, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట డివిజన్‌లో మిషన్ భగీరథ పనులపై ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డీఈ, ఏఈఈ, ఏఈలతో సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై చర్చించారు. అమ్రాబాద్ మండలంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో మిషన్ భగీరథ పైప్‌లైన్లను మార్చాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని ప్రజలకు తాగునీరు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, వర్షాకాలంలో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి దశను సమీక్షిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు.

# ఎమ్మెల్యేకు ఉద్యమకారుల వినతి



**యాదాద్రి సెప్టెంబర్ 15 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
మలిదశ తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఆలేరు మండలం మందనపల్లి క్రాస్ రోడ్ వద్ద ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్లా ఐలయ్య ను కలిసి వినతి పత్రం అందించారు. మలిదశ ఉద్యమకారుల వేదిక కన్వీనర్ మోరిగాడి వెంకటేష్ మాట్లాడుతూ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యమకారుల గురించి చర్చించాలని కోరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే దానికి స్పందనగా తప్పకుండా చర్చిస్తానని మీ హామీలు నెరవేర్చుటకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారుల వేదిక కన్వీనర్ మోరిగాడి వెంకటేష్ కో– కన్వీనర్ ఇక్కిరి శ్రీనివాస్ నాయకులు ఆడెపు బాలస్వామి ఎలగందుల సురేష్ కుడికాల భాను గుజ్జ అశోక్ సంఘీ నీలయ్య బందెల సుభాష్ ఎంఏ ఎజాజ్ కట్టెగొమ్ముల సాగర్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రతి బిడ్డకు పోషణ, విద్య అవసరం

**-దేవరకొండలో “పోషన్ బీ – పడాయి బీ” శిక్షణ కార్యక్రమం**













**దేవరకొండ, సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఐసిడిఎస్ ప్రాజెక్టు దేవరకొండ ఆధ్వర్యంలో “పోషన్ బీ – పడాయి బీ” శిక్షణ కార్యక్రమాన్ని మండల పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సులభంగా అర్థమయ్యేలా, ప్రాక్టికల్ ఆక్టివిటీలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ చంద్రకళ మాట్లాడుతూ“పుట్టిన ప్రతి బిడ్డకు పోషణ అవసరం. చదువు కూడా అంతే అవసరం. బాల్య దశలోనే బిడ్డకు సరైన ఆహారం, విద్య, అభివృద్ధి అవకాశాలు కల్పించాలి” అని పేర్కొన్నారు. ఏసిడిపిఓ అనురాధ మాట్లాడుతూ“మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ మంచి పౌష్టికాహారం అందించాలి. శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధికి ప్రీస్కూల్ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలి. ప్రతి బిడ్డ సమగ్రంగా ఎదగాలంటే మన వంతు కృషి అవసరం” అని వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు ఎన్. రాధా, ఎం. విజయలక్ష్మి, డి. చిట్టెమ్మ, జి. మెరీ, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ అంతయ్య, మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల టీచర్లు పాల్గొన్నారు.

# శాశ్వత పందిళ్లపై తీగజాతి కూరగాయల సాగు లాభదాయకం

**పెద్దపల్లి గ్రామంలో రైతుల సాగు మోడల్‌ను పరిశీలించిన ఉద్యాన శాఖ అధికారులు**





**తెలకపల్లి, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలకపల్లి మండలం పెద్దపల్లి గ్రామంలో సోమవారం ఉదయం జిల్లా ఉద్యాన శాఖ ద్వారా 50 శాతం రాయితీపై మంజూరైన శాశ్వత కూరగాయల పందిళ్లను సందర్శించారు. రైతులు చట్టమోని లింగమయ్య, రాములు శాశ్వత పందిర్లపై బీరకాయ, కాకరకాయ వంటి తీగజాతి కూరగాయలను చెరో ఎకరంనర విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. మొత్తం మూడు ఎకరాల్లో సాగు చేస్తున్న ఈ తోటల నిర్మాణానికి రూ.7.5 లక్షలు, సాగు ఖర్చులకు రూ.2.5 లక్షలు కలిపి మొత్తం రూ.10 లక్షల పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. మొదటి పంట నుంచే ఎకరానికి రూ.2 లక్షల చొప్పున రూ.6 లక్షల నికర ఆదాయం పొందినట్లు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కూరగాయలను తెలకపల్లి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, బోయినపల్లి మార్కెట్లలో విక్రయిస్తున్నట్లు తెలిపారు. శాశ్వత పందిర్లపై బీర, కాకర, సొర, పొట్ల, దొండకాయ వంటి కూరగాయలు మంచి నాణ్యతతో పండుతాయని, నేలపై సాగు చేసిన కూరగాయలతో పోలిస్తే దిగుబడి రెండింతలు వస్తుందని నాగర్‌కర్నూల్ డివిజన్ ఉద్యాన అధికారి వివరించారు. ఒక ఎకరంనర విస్తీర్ణంలో శాశ్వత పందిరి నిర్మాణానికి రూ.1 లక్షల సబ్సిడీ లభిస్తుందని, గరిష్టంగా రెండున్నర ఎకరాల వరకు మంజూరు చేయబడుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన శాఖను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తీర్ణ అధికారి దేవేందర్, రైతులు చట్టమోని లింగమయ్య పాల్గొన్నారు.

# ప్రమాద బాధితుడికి రూ.8 లక్షల పరిహారం

**శ్రీ రామ స్పిన్నింగ్ మిల్లులో గాయపడిన గానుగు రవికి చెక్కు అందజేత**



**తూప్రాన్, సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇటీవల శ్రీ రామ స్పిన్నింగ్ మిల్లులో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గానుగు రవికి రూ.8 లక్షల పరిహారం అందజేయాలని కంపెనీ యాజమాన్యాన్ని ఒప్పించినట్లు సమాచారం. తూప్రాన్ సీఐ, మనోహరాబాద్ ఎస్ఐ సహకారంతో కాళ్లకల్ గ్రామ పెద్దలు యాజమాన్యంతో చర్చించి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేశారు. ఈ పరిహారాన్ని చెక్కు రూపంలో ఈరోజు గానుగు రవి కుటుంబానికి అధికారుల సమక్షంలో అందజేశారు. ప్రమాదంలో గాయపడిన కార్మికుడికి న్యాయం జరిగేలా గ్రామ పెద్దలు, పోలీసు అధికారులు చొరవ చూపిన తీరు ప్రశంసనీయం. పరిస్థితిని గమనించి బాధిత కుటుంబానికి అండగా నిలిచిన గ్రామస్థులు, అధికారులు, కంపెనీ యాజమాన్యం సహకారం ప్రజల్లో సానుకూల స్పందనను కలిగించింది.

# గ్రామాల్లో కుక్కల స్వైర విహారం

## బయటకు వెళ్లాలంటే భయంతో వణికిపోతున్న ప్రజలు









**ఎలిగేడు, సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మండల పరిధిలోని 12 గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పంచాయతీల్లో, వార్డుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలను చూసి చిన్నారులు, మహిళలు, వృద్ధులు భయంతో బయటకు రావడానికి కూడా వెనుకాడుతున్నారు.చిన్నారులపై కుక్కలు దాడి చేయడం, విద్యార్థులను పాఠశాలకు పంపడంలో తల్లిదండ్రులు జంకడం, రాత్రి వేళ ఒంటరిగా బయటకు వెళ్లాలంటే ప్రాణాలరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు.ఒకప్పుడు గ్రామాల్లో కుక్కలను పట్టి శస్త్రచికిత్సలు చేసి సంతానం వృద్ధిని నియంత్రించేవారు. కానీ జంతు సంరక్షణ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత ఆ చర్యలకు బ్రేక్ పడింది. ప్రస్తుతం శస్త్రచికిత్సలు లేకపోవడంతో వీధికుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది.రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ఉండి వాహనదారులపై దాడులు చేయడం, పాదచారులను వెంటాడడం వంటి ఘటనలు రోజూ జరుగుతున్నాయి. ముప్పిరితోటలో నాలుగేళ్ల బాలుడు కుక్క దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటనతో ప్రజలు మరింత ఆందోళనకు గురయ్యారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధికుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

# బీఎంఎస్ పోరాటం ఫలితమిచ్చింది

### తూనిక ఆకుపై జీఎస్టీ తగ్గింపు హర్షణీయం




**కరీంనగర్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బీడీ కార్మికుల సమస్యలపై బీఎంఎస్ చేపట్టిన ఉద్యమం ఫలితమిచ్చిందని రాష్ట్ర కార్యదర్శి రేణిగుంట శంకర్ తెలిపారు. సోమవారం జిల్లా కార్యాలయంలో జరిగిన బీఎంఎస్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తూనిక ఆకుపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం హర్షణీయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో 10 లక్షల మంది బీడీ కార్మికులు జీవిస్తున్నారని, బీడీ పరిశ్రమను చేతివృత్తుల పరిశ్రమగా పరిగణించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినతి పంపినట్లు తెలిపారు.బీడీ ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గించాలని, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పప్పుల సురేష్, జిల్లా అధ్యక్షుడు పసుల శ్రవణ్, కార్యదర్శి తొర్తి శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# సమస్యలపై స్పందించని అధికారులు

### బుధవారం నిరసనకు సిపిఐ పిలుపు



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వర్షాల వల్ల రోడ్లు దెబ్బతిని గుంతలు ఏర్పడినప్పటికీ, ప్రజవానిలో ఫిర్యాదు చేసిన వారం రోజులు గడిచినా ఒక్క గుంతను కూడా పూడ్చకపోవడం మున్సిపల్ అధికారుల ఘోర నిర్లక్ష్యమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ కమిషనర్ ప్రజావానిలో మాత్రమే కనిపించి, ప్రజా సమస్యలు, అక్రమ నిర్మాణాలపై స్పందించకపోవడం బాధాకమని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే బుధవారం కొబ్బరికాయలు కొట్టి నిరసన చేపడతామని హెచ్చరించారు.

# వాగ్దేవి క్లబ్‌కు బ్యానర్ ప్రజెంటేషన్ అవార్డు

### విజయం రికాన్‌లో ఉత్తమ ప్రదర్శన




**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎంఆర్ వైశ్య భవన్‌లో ఆదివారం జరిగిన విజయం రీజనల్ కాన్ఫరెన్స్ 2025 అంగరంగ వైభవంగా ముగిసింది. ఎనిమిది క్లబ్బులు పాల్గొన్న బ్యానర్ ప్రజెంటేషన్‌లో వాగ్దేవి క్లబ్ వాసవి నవదుర్గల రూపకల్పనతో ఉత్తమ ప్రదర్శన ఇచ్చి మొదటి బహుమతి అందుకుంది.అధ్యక్షురాలు రూప శ్రీ, కార్యదర్శి వొజ్జల రాజమణి, కోశాధికారి గంప హరిణి తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో రీజన్ చైర్పర్సన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అలాగే వివిధ కార్యక్రమాల్లో ఉత్తమ నిర్వహణకు ఎనిమిది జ్ఞాపికలు అందజేశారు.

# జంక్షన్ పనుల్లో అవినీతిపై విచారణ జరిపించాలి

### కాంట్రాక్టర్లు -ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు కోరిన సిపిఐ



**కరీంనగర్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగరంలోని జంక్షన్ సుందరీకరణ పనుల్లో భారీ అవినీతి జరిగిందని, కాంట్రాక్టర్లు -ఇంజనీరింగ్ అధికారులు కుమ్మక్కై ప్రజాధనాన్ని దోచుకున్నారని సిపిఐ నగర సమితి ఆరోపించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పమేల సత్పతికి సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు వినతి పత్రం అందజేశారు.గీతా భవన్ చౌరస్తా, పద్మనగర్, బొమ్మకల్, చొక్కా రావు జంక్షన్‌లలో టెండర్ ధర కంటే మూడింతలు అధికంగా బిల్లులు చెల్లించారని, నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగాయని పేర్కొన్నారు. బొమ్మకల్ జంక్షన్‌పై కేసు ఉన్నా పనులు కొనసాగించారని, 2022లో పూర్తయిన పనులకు మళ్లీ టెండర్ పెట్టి బిల్లు చెల్లించారని ఆరోపించారు.అవినీతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# క్రీడాకారులకు అల్ఫోర్స్ చేయూత

### కొత్తపల్లిలో టీషర్ట్‌లు పంపిణీ




**కరీంనగర్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
విద్యార్థుల్లో క్రీడా ఆసక్తి పెంపొందించేందుకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి కొత్తపల్లి మండలంలోని క్రీడాకారులకు టీషర్ట్‌లు పంపిణీ చేశారు. ఎస్సీఎఫ్ కార్యదర్శి గన్నె లక్ష్మణ్‌కు అందజేసిన ఈ దుస్తులు, విద్యార్థుల ప్రాతినిధ్యానికి ఉపయోగపడతాయని తెలిపారు.విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడను ఎంపిక చేసుకొని నైపుణ్యం సాధించి ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని సూచించారు. క్రీడారంగ అభివృద్ధికి అల్ఫోర్స్ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, క్రీడా సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ఇంజనీరింగ్ డే, దారం శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

### ఉద్యోగుల సమస్యలపై పోరాటస్ఫూర్తిని కొనియాడిన నాయకులు




**కరీంనగర్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇంజనీరింగ్ డే సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ జన్మదిన వేడుకలు స్థానిక టీఎన్జీవోస్ భవనంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, గెజిటెడ్ అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఆయన పోరాటస్ఫూర్తిని ప్రశంసించారు. విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో సమాజ సేవలో ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు.అదే రోజు, గర్ల్స్ జూనియర్ కాలేజీ ప్రాంగణంలోని ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, అరటిపండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమంగా జన్మదినాన్ని జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్, పెన్షనర్ల, టీచర్ల, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘాల నాయకులు, జిల్లా, మండల, పట్టణ, రూరల్ స్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ యువజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం

**తెలంగాణ రాష్ట్రం అంబేద్కర్ యువజన సంఘం రిజిస్ట్రేషన్ నెంబర్ 1033/77.**



**దేవరకొండ,సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):** దేవరకొండ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గ్రంథాలయంలో నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నియోజకవర్గం ఇన్చార్జ్ ఎర్ర ఆంజనేయులు, ముఖ్య అతిధులు నల్గొండ జిల్లా అధ్యక్షులు కొండేటి వెంకట్ , జిల్లా కార్యదర్శి సలికినేని టైగర్ జీవా, హాజరైనారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు జేబీ రాజు ,ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు అవిలయ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజుల, పిలుపు మేరకు ఈనెల సెప్టెంబర్ 21. 2025 న తెలంగాణ రాష్ట్రం అంబేద్కర్ యువజన సంఘం ఆవిర్భావం దినోత్సవం వేడుకలను సెప్టెంబర్ 30 వరకు దేవరకొండ నియోజకవర్గంలోని గ్రామ గ్రామాన ప్రతి మండల హెడ్ క్వార్టర్ లో నియోజకవర్గం వ్యాప్తంగా ఘనంగా ఆవిర్భావం దినోత్సవం వేడుకలు నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు మిగిలి ఉన్న మండల కమిటీలను పూర్తిస్థాయిలో నిర్మాణం చేయాలని నల్గొండ జిల్లా అధ్యక్షులు కొండేటి వెంకట్ ఆదేశించారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు సక్రమంగా అందే విధంగా చూడాలని ముఖ్య కార్యకర్తలకు తెలిపారు ఎక్కడ సమస్య ఉన్నా తక్షణమే స్పందించి సమస్య పరిష్కారం అయ్యే దిశగా పనిచేయాలని కోరినారు .ఈ కార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి కొంద్రపల్లి నగేష్, ఉపాధ్యక్షులు కొత్యేం కృష్ణ ,చందంపేట మండల అధ్యక్షులు నాగిళ్ల వెంకటయ్య, డిండి మండల అధ్యక్షులు పేరుమల్ల అనిల్ కుమార్, దేవరకొండ మండల అధ్యక్షులు సలికినేని సాలయ్య ,కొండమల్లేపల్లి మండల అధ్యక్షులు కూర శ్రీకాంత్, పీఏ పల్లి మండల అధ్యక్షులు దున్న ముత్యాలు, గుడిపల్లి మండల అధ్యక్షులు బోడ నాగరాజు , అనుబంధ సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# “సేవా పక్షం” విజయవంతం చేయాలి

**డాక్టర్ వన్నల వెంకటరమణ**



**వర్ధన్నపేట, సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):** సెప్టెంబర్ 17 నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించే “సేవా పక్షం” కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ బిజెపి శ్రేణులకు పిలుపునిచ్చారు. జాతీయ పార్టీ ఆదేశానుసారం, రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఖిలా వరంగల్ మండలంలో మండల అధ్యక్షులు అర్జున్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కో కన్వీనర్ సంగీత్ , కర్నె రవీందర్, మండలం సేవ పక్ష కన్వీనర్ చంద్ర మోహన్ సమక్షంలో మండల పరిధిలో సేవా పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు - వరంగల్ తూర్పు నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్ రావు తో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ హాజరయ్యారు.అనంతరం డాక్టర్ వన్నాల మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 17 నుండి అక్టోబర్ 2 తేదీ వరకు తలపెట్టిన సేవాపక్షం కార్యక్రమాలను విజయవంతం చేయాలని,అదేవిధంగా సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించాలని అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో చేయవల్సిన కొన్ని కార్యక్రమాలు మహిళా మోర్చా తరుపున చిత్రాలేఖణం, స్వతంత్ర సమరయోధులు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు సన్మానించుకోవడం,
మండల స్థాయి లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టాలని, దివ్యంగులను సన్మానించుకొనుట, దీన దయాల్ జన్మదిన పురస్కరించుకొని ప్రతి ఇంట్లో మొక్క నాటడం ద్వారా ఈ 15 రోజులు చేయవల్సిందిగా పార్టీ ఆదేశించడంతో మండల నేతలకు చెయ్యవాల్సిన కార్యక్రమాలను డాక్టర్ వన్నాల వెంకట రమణ వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, కందిమల్ల మహేష్ , సిద్ధం నరేష్,మోహన చారి జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఎన్ఎం ల ఆందోళన ను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి

**తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ 1 డిమాండ్....**



**కోటి, సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎన్సిడి పై ఏఎన్ఎంలు చేస్తున్న ఆందోళన ను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ 1 రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కర్నాటి సాయి రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కర్నాటి సాయి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశం నందు ఎన్సిడి ప్రతిరోజు ప్రభుత్వ ఆసుపత్రి మరియు ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే అవుట్ పేషెంట్ల వివరాలను ఎన్సీడీ యాప్ నందు అప్లోడ్ చేయడం ద్వారా ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుతాయని తద్వారా ఆరోగ్య కార్యకర్తలపై పనిభారం కూడా తగ్గుతుందని ఆయన వివరించారు. అలాగే ఏఎన్ఎంలు ఇప్పటికే పడుతున్న పని ఒత్తిడిని తగ్గించడానికి వారి మొబైల్ లలో ఇన్ స్టాల్ చేయబడిన యాప్ లను తీసివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఏఎన్ఎం లను సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఎలాంటి ఆన్లైన్ పనులను చేయమని ఒత్తిడి చేయవద్దని సాయి రెడ్డి అధికారులను కోరారు. ఏఎన్ఎంలు ఇంట్లో కూడా ఆన్లైన్ ఉద్యోగ బాధ్యతలు రాత్రి 12 గంటల వరకు చేస్తున్నారని ఈ విధానాల వల్ల అనారోగ్యం పాలు అవుతున్నారనీ మరియు కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పునరాలోచించి ఏబిఏఎస్ అటెండెన్స్ నుంచి కూడా ఫీల్డ్ స్టాఫ్ ను మినహాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, ధనలక్ష్మి, సుజాత, ఆదిలక్ష్మి, పుల్లమ్మ,, పద్మ, నాగమణి, అనసూయ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

# వర్కింగ్ జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు



**యాదాద్రి సెప్టెంబర్ 15 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** : వర్కింగ్ జర్నలిస్టులందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తానని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం భువనగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీయూడబ్ల్యుజే ఐజెయూ కమిటీ జిల్లా అధ్యక్షులు యంబ నర్సింహులు ఆధ్వర్యంలో ప్రతినిధులు కుంభంను కలిసి వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారే అత్యధికంగా జర్నలిస్టుల వృత్తిలో ఉన్నారని వివరించారు. అక్రిడేషన్‌తో సంబంధం లేకుండా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారందరికి ఇళ్లు మంజూరు చేయాలని విజప్తి చేశారు. ప్రభుత్వం పేదలకు ఇస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల జాబితాలో జర్నలిస్టులకు ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు.డివిజన్ కేంద్రం నుంచి మున్సిపాలిటీ కొనసాగుతున్న భువనగిరి జిల్లా కేంద్రంలో దశాబ్ధాలుగా పనిచేస్తున్న వారికి ఒక్కరికి కూడా ప్రభుత్వం గతంలో ఇల్లు మంజూరు చేయలేదన్నారు. అన్ని మండలాల్లో ఉన్న జర్నలిస్టులు కొన్నేళ్లుగా ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ఉన్న జర్నలిస్టులకు రెండవ విడుత ఇందిరమ్మ జాబితాలో ఇళ్లను మంజూరు చేస్తానన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పై అలుపెరుగకుండా శ్రమిస్తున్న జర్నలిస్టులందరికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. జర్నలిస్టుల న్యాయమైన కోర్కెలనుప్రభుత్వ పరంగా తీర్చడానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామి ఇచ్చారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యుజే (ఐజేయూ) ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త భట్టు రామచంద్రయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, యూనియన్ ప్రతినిధులు కందుకూరి సోమయ్య, పాశం నవీన్, పత్తిపాటి ఆనంద్, ఆరె కుమార్, ఎండీ జమాలోద్దీన్, బొడిగెదిలిప్, సతీష్, ముద్దం ఉదయ్‌రెడ్డి, మెరుగు అనిల్, ఎండీ జాకీర్,శత్రునాయక్,కనక బాలకృష్ణ, బొల్లేపల్లి కిషన్, దుబ్బ సురేష్, కూరెళ్ల శ్రీనివాస్, శంకర్, టీజేయూ అధ్యక్షుడు షానూర్ బాబ పాల్గొన్నారు.

# దేవరకొండలో ఎస్‌జీఎఫ్ టోర్నమెంట్‌కు రంగం సిద్ధం

**18న జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రారంభం**

**దేవరకొండ, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** 69వ ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి టోర్నమెంట్ సెలెక్షన్లు ఈనెల 18న ఉదయం 9.30 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ప్రాంగణంలో ప్రారంభం కానున్నాయి. శాసన సభ్యుడు నేనావత్ బాలు నాయక్ సౌజన్యంతో ఈ క్రీడలు నిర్వహించనున్నారు.అండర్-14 విభాగానికి 01.01.2012 తర్వాత, అండర్ -17కు 01.01.2009 తర్వాత జన్మించిన విద్యార్థులు అర్హులని కన్వీనర్ జయమ్మ తెలిపారు. కబడ్డీ విభాగంలో బరువు పరిమితులు బాలికలకు 48 కిలోలు, బాలురకు 51 కిలోలు, అండర్ -17కు 55 కిలోల లోపుగా ఉండాలి.కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో పోటీలు, ఎంపికలు నిర్వహించనున్న ఈ టోర్నమెంట్‌కు అన్ని మండలాల పిడి/పిఈటీలు తమ విద్యార్థులను బోనాఫైడ్ సర్టిఫికెట్లతో సమయానికి తీసుకురావాలని ఎంఈఓ మాతృ నాయక్, ఇంచార్జ్ జయమ్మ సంయుక్త ప్రకటనలో తెలిపారు.

# క్రమశిక్షణకు గుర్తింపు

**ఎంగలి ప్రసాద్‌కు ఐఎన్టీయూసీ సన్మానం**




**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా ఐఎన్టీయూసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్ చేతుల మీదుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు సాయి, పర్వతాలు, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, వనపర్తి జిల్లా మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ల పెంపు కోసం ఎమ్మార్వో కార్యాలయ ముట్టడి

**రేవంత్ సర్కార్ హామీ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్**




**మహేశ్వరం, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** 22 నెలలుగా పెన్షన్ పెంపు కోసం ఎదురు చూస్తున్న వికలాంగులు, వృద్ధులు, వితంతువుల తరఫున ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడించారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మహేశ్వరం మండల కేంద్రంలో జరిగిన ఈ ఆందోళనకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ళ బాబు మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.2023 ఎన్నికల్లో రేవంత్ రెడ్డి రూ.6000 వికలాంగులకు, రూ.4000 వృద్ధులు, వితంతువులకు పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు అమలు చేయకపోవడం దారుణమని విమర్శించారు. రైతులకు బంధు, రుణమాఫీ చేస్తూ, పింఛన్‌దారులను విస్మరించడం సరికాదని మండిపడ్డారు.ఈ నెల 20న గ్రామ పంచాయితీల వద్ద మహాధర్నాలు, అక్టోబర్ రెండో వారంలో “చలో హైదరాబాద్” మహాగర్జన సభ నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల నాయకులు, పెద్ద సంఖ్యలో పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

# మహేశ్వరం మోడల్ స్కూల్‌పై ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు

**ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్**



**మహేశ్వరం, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మహేశ్వరం మోడల్ స్కూల్‌లో జరుగుతున్న అవకతవకలపై ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రజా దర్బార్‌లో ఫిర్యాదు చేసింది. ప్రిన్సిపల్ సమయాన్ని పాటించకుండా ఇష్టానుసారంగా పాఠశాలకు రావడం, స్కావెంజర్ల జీతాల నిధుల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవై ప్రవీణ్ ఆరోపించారు.825 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో ఇద్దరు స్కావెంజర్లకు రూ.10 వేల చొప్పున జీతం ఇవ్వాల్సి ఉండగా, రూ.7 వేల చొప్పున చెల్లిస్తూ రూ.6 వేలు పక్కదారి పట్టిస్తున్నారని తెలిపారు. మిడ్ డే మీల్స్‌లో కూడా అవకతవకలు ఉన్నాయని పేర్కొన్నారు.వెంటనే ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని, స్కావెంజర్ నిధుల స్కాంపై విచారణ జరిపించాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, అడిషనల్ డీఈవో పూర్ణచంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎరుపుల తరంగ్, కమిటీ సభ్యులు సిద్దు, తరుణ్, రాహుల్, కిరణ్, భారత్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట,సెప్టెంబర్ 15 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ప్రజావాణి ఫిర్యాదులను జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ద పెట్టి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టరెట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు తో కలసి ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ వివిధ అంశాలను సమీక్షిస్తూ జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి ప్రజావాణిలో పెండింగ్ ఫిర్యాదులపై దృష్టి సారించి తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి అధికారి తమ శాఖ సిబ్బందితో రేపు, ఎల్లుండి స్టాప్ మీటింగ్ పెట్టాలని, క్షేత్రస్థాయి సిబ్బందికి ఫీల్డ్ మీటింగ్ లేదా వెబ్ ఎక్స్ మీటింగ్ పెట్టి సిబ్బందికి సూచనలు జారీ చేయాలని, ఎలాంటి పెండింగ్ పనులు లేకుండ పూర్తి చేయాలని అన్నారు. ప్రజావాణిలో భూములకు సంబంధించి 10 ఫిర్యాదులు, ఎంపీడీవోలకు 9 ,వైద్య ఆరోగ్య శాఖకి 2, డిపిఓకి 2, ఇతర అధికారులకు 18 ఫిర్యాదులు ,మొత్తం 41 ఫిర్యాదులు వచ్చాయని వీటన్నింటిని సంబంధిత శాఖల అధికారులకు పంపడం జరిగిందని, జాగ్రత్తగా అన్నిటిని పరిశీలించి ఆలస్యం చేయకుండా వేగంగా పరిష్కరించెందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ పిడి వివి అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఏఓ శ్రీధర్‌రెడ్డి, డిసీఓ పద్మ, డిఈఓ అశోక్, డి ఎంహెచ్ఓ చంద్రశేఖర్,సంక్షేమ అధికారులు దయానంద రాణి, శంకర్ నాయక్, కలెక్టరేట్ పరిపాలనాధికారి సుదర్శన్ రెడ్డి, సూపర్టీడెంట్లు, అధికారులు, సిబ్బంది తదితరులు ప్రజావాణి కార్యక్రమానికి హాజరుయ్యారు.

# మంచిర్యాలలో వందే భారత్ హాల్టింగ్

**పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పోరాటం ఫలితం**



**మంచిర్యాల, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగపూర్ –సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు మంచిర్యాల రైల్వే స్టేషన్లో హాల్టింగ్ కల్పించబడింది. కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు.రెండేళ్లుగా హాల్టింగ్ కోసం కృషి చేసిన ఎంపీ వంశీకృష్ణ సింగరేణి ద్వారా భారీ ఆదాయం వచ్చినా, రైల్వే కనెక్టివిటీ లేక ఇబ్బందులు పడుతున్న ప్రజల కోసం నిరంతరం పోరాటం చేశారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.వంశీకృష్ణ కృషితో రామగుండం, పెద్దపల్లి, బెల్లంపల్లి స్టేషన్లలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్‌లు మంజూరయ్యాయి. మంచిర్యాలలో నివసిస్తున్న మార్వాడీ, రాజస్థానీ ప్రజల డిమాండ్ మేరకు చెన్నై –భగత్ కీ కోఠి ప్రత్యేక రైలును రోజువారీగా నడిపేలా రైల్వే శాఖను కోరారు. ఈ నిర్ణయాలతో ఉత్తర తెలంగాణ ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగవుతాయని ఎంపీ పేర్కొన్నారు.

# ఓయూ కాలనీలో అంజన్ కుమార్ యాదవ్ పర్యటన...



**హైదరాబాద్,సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో ఇబ్బంది పడుతున్న కాలనీలలో మాజీ ఎంపీ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్ పర్యటించారు. వివరాలు లోకి వెళ్తే షేక్పేట్ డివిజన్ లోని ఓయూ కాలనీలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులను కలిసి అడిగి వరదల వల్ల ఏమైనా నష్టాలు జరగాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో మాట్లాడుతూ వర్షాల వల్ల ఇబ్బందుల ఇబ్బందులు పడ్డ కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని కాలనీవాసులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో షేక్పేట్ డివిజన్ ప్రెసిడెంట్ జి.సత్యనారాయణ, నిజాముద్దీన్, ఓయూ కాలనీ ప్రెసిడెంట్ రవి కుమార్, ప్రీతి, స్వరూప, రమేష్, ఒమర్, మక్బూల్ మరియు కాలనీవాసులు కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో ఈ పర్యటనలో పాల్గొన్నారు.

# డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డికి "ఉత్తమ పర్యావరణ వేత్త అవార్డు 2025" ప్రదానం





**హైదరాబాద్, సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పర్యావరణ పరిరక్షణ కోసం అహర్నిశలూ కృషి చేసిన ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డికి ఉత్తమ పర్యావరణ వేత్త అవార్డు 2025ను ప్రదానం చేశారు. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణ రెడ్డి చేతుల మీదుగా, హైదరాబాద్‌లోని మసాబ్ ట్యాంక్‌లోని తెలంగాణ స్టేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ కార్యాలయంలో తెలంగాణ ఇంటెలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి విద్యా, సామాజిక రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. టిఆర్ఎస్ అధ్యక్షుడు సాదుల మధుసూదన్ గారు తన ప్రసంగంలో రాబోయే తరానికి పర్యావరణాన్ని కాపాడటం ఎంతో అవసరం అన్నారు. మన చర్యలు భవిష్యత్ తరాల ఆరోగ్యాన్ని, జీవనాన్ని ప్రభావితం చేస్తాయి. ప్రకృతిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న చిన్న ప్రయత్నాలే పెద్ద మార్పును తీసుకువస్తాయని స్పష్టంగా పేర్కొన్నారు. ఆయన ప్రసంగం అందరినీ ప్రేరేపించి, పర్యావరణంపై అవగాహన పెంచేందుకు దోహదపడింది. లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్స్ డైరెక్టర్ కోమటిరెడ్డి అభిషేక్ రెడ్డి, ఇతర ప్రముఖులు కూడా పాల్గొని డాక్టర్ గోపాల్ రెడ్డి సేవలను అభినందించారు. ప్రొఫెసర్ వి.బాలకృష్ణ రెడ్డి తన ప్రసంగంలో, ఓజోన్ పొరను కాపాడటం మన అందరి బాధ్యత. దీనిని సంరక్షించకపోతే జీవితం నిలవదు. సౌరశక్తిని వినియోగించడం ద్వారా గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించవచ్చు అని పేర్కొన్నారు. డాక్టర్ మోహమ్మద్ అక్తర్ అలీ, ఓజోన్ పొర హానికరమైన కిరణాలను శోషించి జీవాన్ని కాపాడే కవచం లాంటిదని వివరించారు. డాక్టర్ గోపాల్ రెడ్డిని శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ఆయన 25 ఏళ్లుగా చేపడుతున్న పర్యావరణ కార్యక్రమాలు వృక్షార్చన, ప్లాస్టిక్ తగ్గింపు, అవగాహన శిబిరాలు – అందరికి ఆదర్శంగా నిలిచాయి.అంతేకాకుండా, ఆయన ఇటీవల న్యూయార్క్‌లో జరిగే "గ్లోబల్ గ్రీన్ మెంబర్ అవార్డు 2025"కు ఎంపికైన సందర్భంగా శుభాకాంక్షలు అందించారు. చర్యలకు పిలుపు పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించండనీ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించండనీ, వృక్షార్చన కార్యక్రమాలు చేపట్టండనీ, పిల్లలకు, సమాజానికి పర్యావరణంపై అవగాహన కల్పించండి, భవిష్యత్ తరానికి మంచి ప్రపంచాన్ని అందించేందుకు కలిసి పనిచేద్దామని అన్నారు.ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణపై సామాజిక బాధ్యతను మరింత బలపరచింది. ప్రఖ్యాత విద్యావేత్త సాదుల మధుసూదన్ చేసిన ప్రసంగం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా



**యాదాద్రి,సెప్టెంబర్ 15 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కాటమయ్య నగర్ లో సిసి రోడ్లు మురుగు కాలువల నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరుతూ సోమవారం సీపీఐ(ఎం) పట్టణ కమిటీ ఆలేరు మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఎంఏ ఇక్బాల్ పట్టణ నాయకులు మోరిగాడి రమేష్ మాట్లాడుతూ కాటమయ్య నగర్ లో సీసీ రోడ్లు మురుగు కాలువలు నిర్మాణం చేయకపోవడం వలన దశాబ్దాలుగా ఆ కాలనీవాసులు వర్షాకాలం వచ్చిందంటే అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే వెంటనే తన నిధుల నుండి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని కోరారు.పన్నులు వసూలు చేయడంలో చూపిస్తున్న శ్రద్ధ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం లో చూపించడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు.వెంటనే కాటమయ్య నగర్ నుండి ఆలేరు పెద్దవాగు వరకు మురుగు కాలువ నిర్మాణం చేయాలని, కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణము మురుగు కాలువ నిర్మాణం చేపట్టాలన్నారు. కాటమయ్య నగర్ నుండి జాతీయ రహదారి దర్గా వరకు రోడ్డు వేసి వీధి లైట్ల స్తంభాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిసి రోడ్లు మురుగు కాలువలు ఇతర సమస్యల పై గతంలో కాలనీవాసులు ఎమ్మెల్యే ని కలిసి విన్నవించగా గతంలో హామీ ఇచ్చారు. పనులు ప్రారంభిస్తా అని చెప్పారు. ఏడాది కావస్తున్న ఇప్పటివరకు ఎలాంటి పనులు జరగలేదని వెంటనే ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు తీసుకెళ్లి వెంటనే సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ధర్నాలో పాల్గొన్న కాలనీ ప్రజలు"మేము ఇల్లు కట్టుకొని దాదాపుగా 30 సంవత్సరాలు గడిచినప్పటికీ మా వీధిలో సీసీ రోడ్డు రాలేదని మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని కమిషనర్ కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు." కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కాటమయ్య నగర్ వాసులు చెప్పిన సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పట్టణ నాయకులు ఘణగాని మల్లేశం, అయిలి చంద్రకళ,మద్దెల కుమార్, ధడక గణేష్,మోరిగాడి అనిత,మైలారం కళ్యాణి,కుడుదుల భాగ్య, కటకం పుష్ప,అంగిరేకుల భాగ్య,రచ్చ వజ్రమ్మ,బేతి పద్మ,కడవేరు ఉమా,కడివేరు లక్ష్మి,మోరిగాడి దేవి, బేతి రఘురాములు,లక్కాకుల శ్రీను, రేగోటి నరేందర్,మోరిగాడి అశోక్, మోరిగాడి అంజయ్య పాల్గొన్నారు.

# బాలాపూర్ మండల కేంద్రంలో.. ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట వికలాంగుల ధర్నా




**బాలాపూర్,సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రంలో మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బాలాపూర్ మండల్ కార్యాలయం ముందు పెన్షన్ పెంచాలని వికలాంగులు మరియు చేయూత పెన్షన్ దారులు మహా ధర్నాను విజయవంతం చేయడం జరిగింది ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా మాజీ అధికార ప్రతినిధి మండల ఇన్చార్జి బోర్ర రవి మాదిగ ఆధ్వర్యంలో బాలాపూర్ మండల్ కన్వీనర్ వంక ప్రభాకర్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు డీకే నరసింహ మస్కూరు సుధాకర్ అన్న జనార్ధన్ పెన్షన్లు పెంచకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం పై యుద్ధమే – అధికార పార్టీ పెంచదు ప్రతిపక్షం అడగదు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు వికలాంగులకు 6000 పెన్షన్, వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు చేనేత గీత కార్మికులకు 4000 పెన్షన్ పెంచుతామని చెప్పి నేటికీ 22 నెలలు గడుస్తున్న పెన్షన్లు పెంచకపోవడం ఏంటని ప్రశ్నించారు. అదేవిధంగా ఇప్పటివరకు దరఖాస్తు చేసుకొని సంవత్సరాలకు కొద్ది పెండింగ్లో ఉన్న పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాలాపూర్ తాసిల్దార్ కి డిటి కి వేరువేరున వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందిపెన్షన్లు పెంచకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం పై యుద్ధం చేయడానికి పెన్షన్దారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల లోపు పెన్షన్లు పెంచకపోతే పెన్షన్ దారుల సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి పెన్షన్లు పెంచాడని గుర్తు చేశారు. ప్రతి నెల ఒకటో తారీకునే పెన్షన్లు ఇస్తున్నాడని చంద్రబాబు నాయుడుని అభినందించారు. రేవంత్ రెడ్డి చంద్రబాబు నాయుడు ని చూసి నేర్చుకోవాలని గుర్తు చేశారు. ఇప్పటికైనా పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల బాలాపూర్ దివ్యాంగుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మండల కామాచి మహేష్ ఉపాధ్యక్షులు అల్లం రామకృష్ణ లీగల్ అడ్వైజర్ ప్రేమ్ కుమార్ విజయకుమార్ లింగస్వామి చాగంటి పుల్లయ్య కొండమీద శ్రీనివాస్ రవి చంద్రశేఖర్ నవీన్ నరసింహ అంజి కుమార్ కల్పనా శీను దుర్గ జంగమ్మ మూర్తి ప్రవీణ్ సురేష్ కల్పన చంద్రకళ విజయ్ కుమార్ సురేందర్ శేఖర్ సంతోష్ శేఖర్ భాస్కరాచారి విజయ్ కుమార్ ప్రభాకర్ శేఖర్ సత్యనారాయణ గజేందర్ బాలమణి సురేష్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద ఎత్తున సీఐటీయులో చేరిన మెప్మా ఆర్పీలు

**యాదాద్రి,సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

జిల్లాలో మున్సిపల్ కేంద్రాలలో పట్టణ పేదల నిర్మూలన సంస్థ (మెప్మా)లో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్స్ (ఆర్పి) లు, టిఆర్ఎస్కెవి సంఘానికి రాజీనామా చేసి ఆదివారం సిఐటియు లో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి పాండు, కల్లూరి మల్లేశం ల సమక్షంలో పోచంపల్లి,ఆలేరు, మోత్కూరు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీల ఆర్పీలు లు రామస్వామి వసంత అన్నపూర్ణ పరమేశ్వరి అండాలు ఆధ్వర్యంలో సిఐటియు లో చేరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు దాసరి పాండు, కల్లూరి మల్లేశం లు మాట్లాడుతూ.. గతంలో అధికారంలో ఉన్నా కనీస వేతనం ఇస్తామని మభ్య మాటలు చెప్పి సంఘాల్లో చేర్పించుకున్నారన్నారు. 10 సంవత్సరాలు గడిచిన తర్వాత కార్మికులు కనువిప్పు కలిగి తిరిగి మాతృ సంస్థ అయిన సిఐటియులో చేరడం ద్వారా పోరాటాలకు బలం చేకూరుతుందని తెలియజేశారు.



సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాల ద్వారా హక్కులు, వేతనాలు సాధించుకున్న చరిత్ర ఉన్నదని గుర్తు చేశారు. వి బి కే లుగా ఉన్నప్పుడు పోరాటాలు నిర్వహించిందన్నారు. నేడు ఆర్పి లను సంఘటితం చేసి వేతనాలు సాధించుకోబోయే ది కూడా సి ఐ టి యు నే అని పునరుద్ఘాటించారు.రేవంత్ రెడ్డి గత ప్రభుత్వ బాటలో నడవకుండా ఆర్పీలకు కనీస వేతనం ఇవ్వాలని, సీనియారిటీ గుర్తించి ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. సంబంధం లేని పనులు చెప్తూ లను పనిఒత్తిడికి గురిచేస్తున్నారని వెంటనే జాబ్ చాట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇస్తున్న కొద్దిపాటి వేతనం నేటికి మూడు నెలలు కావస్తున్న ఇవ్వడం లేదన్నారు. పెండింగ్ లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని, కనీస గుర్తింపు కార్డ్ లేదని,డ్రెస్ కోడ్ కూడా లేదని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు మున్సిపాలిటీల నుండి 50 మంది చేరడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ,నాయకులు మంగ వెంకటేష్, పరుషరాములు, సృజన,నవనీత, చంద్రిక,రాజేశ్వరి,సత్యవతి,చింతకింది వాణి,నాగమణి, సమ్మక్క, పద్మజ, సుజాత,ధనలక్ష్మి పాల్గొన్నారు.

# విద్యా సంవత్సరం మధ్యలో పిల్లల్ని ఎక్కడ జాయిన్ చేయాలి?

- మేధా స్కూల్ వద్ద తల్లిదండ్రుల ఆందోళన
- సీజ్ అయిన విషయం తెలియక బడికి వచ్చిన విద్యార్థులు
- స్కూల్ను పరిశీలించిన విద్యాశాఖ అధికారులు
- విద్యార్థులకు సమీప పాఠశాలల్లో చేర్పిస్తామన్న ఎంఈవో




**హైదరాబాద్,సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

అల్ప్రాజోలం తయారీ కేసులో సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలోని మేధా స్కూల్ను అధికారులు ఆదివారం సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ సమాచారం తెలియక సోమవారం విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి పాఠశాలకు వచ్చారు. పాఠశాల సీజ్ అయినట్లుగా తమకు కనీసం సమాచారం కూడా ఇవ్వలేదని, అకడమిక్ ఇయర్ మధ్యలో పిల్లలను ఎక్కడికి పంపించాలని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. స్కూల్లో మత్తు పదార్థాలు తయారు చేయడం దారుణమని తల్లిదండ్రులు అన్నారు. మరోవైపు పాఠశాలను విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. విద్యార్థులు అకడమిక్ ఇయర్ నష్టపోకుండా చూస్తామని తెలిపారు.

**- విద్యార్థుల భవితవ్యంపై తల్లిదండ్రుల ఆందోళన**

సోమవారం పరీక్షలు ఉన్నాయనే సమాచారం తెలియడంతో పిల్లలను తీసుకుని పాఠశాలకు వచ్చినట్లుగా విద్యార్థుల తల్లిదండ్రులు వివరించారు. అక్కడికి వచ్చాక స్కూల్ను సీజ్ చేశారని తెలియడంతో తమ పిల్లల భవిష్యత్తే వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వారి భవిష్యత్ను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ అధికారులు ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని కోరారు. ఇప్పటికే 70శాతం ఫీజులను చెల్లించినట్లుగా చెప్పారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

# నల్గొండ జిల్లాను టీబి రహిత, మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి రాష్ట్ర గవర్నర్ :జిష్ణుదేవ్ వర్మ

**నల్లగొండ ,సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

ఒకరోజు నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం అయన మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం నాల్గవ స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం, నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదీత్య భవన్లో జిల్లా అధికారులు, ప్రముఖ వ్యక్తులతో లతో ముఖాముఖి నిర్వహించారు.ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ముందుగా రాష్ట్ర గవర్నర్ కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ.... నల్గొండ జిల్లాలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, జిల్లాలో వైటిపిఎస్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య, విద్య,జల్ జీవన్, ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ పథకం, సమగ్ర శిక్ష అభియాన్, భవిత కేంద్రాలు గ్రామ సడక్ యోజన, టి బి ముక్త్ భారత్, ఆయుష్మాన్ భారత్,గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ, స్వచ్ఛభారత్, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం, గృహ నిర్మాణం, ఇందిరమ్మ ఇండ్లు, ఆబ జన జాతీయ యోజన, ఆది కర్మయోగి అభియాన్, తదితర పథకాలపై లెక్కలతో సహా వివరించారు. రాష్ట్ర గవర్నర్




జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ క్షయ వ్యాధిని జిల్లాలో సమూలంగా నిర్మూలించేందుకు ఉన్న అడ్డంకులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల్లో టీబీ పట్ల అవగాహన కల్పించాలని, క్షయ వ్యాధి నివారణకు సొసైటీలో అందరినీ భాగస్వామ్యం చేయాలని అన్నారు. ముఖ్యంగా నల్గొండ జిల్లాలో కవులు, కళాకారులు, రచయితలు వివిధ రంగాలలోని ప్రముఖులను టీబి ముక్త్ భారత్ లో భాగస్వాములను చేసి వారితో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి టీబిని పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు చేపట్టాలని నల్గొండ పార్లమెంటు సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డికి సూచించారు. టి బి నివారణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టీబిముక్త్ భారత్ కార్యక్రమానికి భారత ప్రధాని సైతం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమం పై ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని వర్గాల ప్రజలఅభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని, గ్రామాలలోసర్పంచ్ లను చురుకుగా పాల్గొనే విధంగా చూడాలని,కవులు,కళాకారులు, రచయితల ద్వారా సాంఘిక నాటకాలు,నాటికలు,పద్యాలు,పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించాలని,టీబికి వ్యతిరేకంగా అందర్నీ భాగస్వాములు చేయాలని సూచించారు. అలాగే నల్గొండ జిల్లాలో గాంజాఎక్కువ మొత్తంలో ఉందని తెలుసుకొని గాంజా నిర్మూలనలోసైతం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఈ రెండు అంశాలపై తోపాటు, మహిళా సాధికారతకు కృషి చేయాలని, ఈకార్యక్రమాలలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయాలని చెప్పారు. కళాకారులు, కవులు, పర్యావరణవేత్తలు సైతం టీబీముక్తుభారత్ లో పనిచేయాలని కోరారు. విశ్వవిద్యాలయ వీసీలు మొదలుకొని కింది స్థాయి వరకు అందరూభాగస్వాములు అయితే టీబి, మాదకద్రవ్యాలను పూర్తిగా నివారించవచ్చని, అప్పుడు నల్గొండ జిల్లాను టీబి, మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్ద వచ్చనిఅన్నారు.

# 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

### తపస్ కరీంనగర్ జిల్లా శాఖ ద్వారా ప్రధానమంత్రి కి వినతి

**కరీంనగర్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

విద్యాహక్కు చట్టం ఆర్టీఈ -2009 ప్రకారం 2010కి ముందు ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు టెట్ అర్హత పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని తపస్ జిల్లా శాఖ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఏబీఆర్ఎస్ఎం, తపస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి బి. వెంకటేశ్వర్లు ద్వారా ప్రధానమంత్రి కి వినతిపత్రం పంపారు. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు ప్రకారం, ఐదేళ్లకు



పైగా సేవలో ఉన్న ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అని పేర్కొనగా, 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు ఎన్సీటీఈ మినహాయింపు ఇచ్చిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. లక్షలాది ఉపాధ్యాయుల భవిష్యత్తు దృష్ట్యా టెట్ మినహాయింపు కల్పించాలని ప్రధానమంత్రి సానుకూలంగా స్పందించాలని తపస్ విజ్ఞప్తి చేసింది.ఈ కార్యక్రమంలో ఓరుగంటి కరుణాకర్ రావు, కట్కూరి శ్రీధర్ రెడ్డి, కే. రవి కిరణ్, రంగోజు శ్రీనివాస్, రాచకొండ పవన్ కుమార్, బి. సత్యనారాయణ, ద్యావనపల్లి శ్రీకాంత్ రావు, సిహెచ్. వెంకటేశ్వర్లు, ముద్దం రాజశేఖర్, బోనాల మదన్, కామిరెడ్డి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చండి మాజీ మంత్రి సబితాఇంద్రరెడ్డి

### అంగన్వాడి టీచర్ల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడుతాను



**బాలాపూర్,సెప్టెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లు తమ సమస్యల పరిష్కారం కోసం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి మెమొరాండం సమర్పించారు.అంగన్వాడీలను నిర్వీర్యం చేసే విధంగా ప్రీ ప్రైమరీ స్కూల్లను ఏర్పాటు చేయడం తగదని, వాటిని అంగన్వాడీ టీచర్లకే అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రేవంత్ రెడ్డి సర్కార్ 18 వేతనం అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ "అంగన్వాడీ టీచర్ల సమస్యలు న్యాయమైనవే. తరఫున రాబోయే అసెంబ్లీలో గళం విప్పుతాను. ముఖ్యంగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు మీ పక్షాన పోరాటం కొనసాగిస్తాను" అని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గంలోని అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి

### గోదావరిఖనిలో ఏబీవీపీ రాస్తారోకో



**గోదావరిఖని, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పెండింగ్‌లో ఉన్న 8700 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో మున్సిపల్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్, టౌన్ ఇంచార్జ్ పిడుగు సిద్ధార్థ పాల్గొన్నారు.పేద, బడుగు, దళిత, గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, కళాశాలలు ఫీజులు వసూలు చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల హామీలు అమలుకావడం లేదని, విద్యాశాఖకు మంత్రి లేకపోవడమే ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఫీజులు విడుదల చేయకపోతే రాష్ట్ర సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్, శివ, సందీప్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# రామగుండంలో పాఠశాల, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

### ఎంపీ రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు ప్రారంభం



**రామగుండం, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో అశోక్ నగర్ బాలికల జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పెద్దపల్లి నిధులతో 100 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.అదేరోజు, ట్రాన్స్ఫర్ డ్యూటీ నిధులతో నగరంలోని ఆర్టీసీ కాలనీ, కేసిఆర్ కాలనీ, పద్మావతి కాలనీ, ఆర్కే గార్డెన్స్, మార్కండేయ కాలనీ, శ్రీ దుర్గానగర్, సాధనా నగర్, సాయినగర్, భవానీనగర్ ప్రాంతాల్లో 186.50 లక్షల అంచనా వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.'ప్రతి కాలనీకి ప్రాధాన్యత ఇచ్చి సమగ్ర అభివృద్ధి చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. మౌలిక వసతుల విస్తరణకు కృషి చేస్తున్నాం" అని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# భరోసా ఆధ్వర్యంలో ఘనంగా ఇంజనీర్స్ డే



**కరీంనగర్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఏసీ ఫంక్షన్ హాల్లో ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఎస్ఈ తాటిపల్లి శ్రీనివాస్ గుప్తాను భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సన్మానించారు.కార్యక్రమంలో భరోసా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు, కన్వీనర్ రాచమల్ల భద్రయ్య, ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శి సామ లక్ష్మణ్, పట్టణ కోశాధికారి సుద్దాల వెంకటేష్, కాంట్రాక్టర్లు చింతల ఎల్లారెడ్డి, పూసాల నారాయణస్వామి, భరోసా సభ్యులు తాటిపెల్లి సతీష్ బాబు, కేశెట్టి లక్ష్మణ్ కుమార్, తొర్తి శంకర్, పాత శ్రీనివాస్, పూసల మధుకర్, మనోజ్, మలహలరావు తదితరులు పాల్గొన్నారు.

# బైక్‌పై మంత్రి సీతక్క పర్యటన

మేడారం జాతర ఏర్పాట్లపై ప్రత్యక్ష సమీక్ష



**ములుగు, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మేడారం మహా జాతర ఏర్పాట్లను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రత్యక్షంగా పరిశీలించారు. ములుగు ఎస్పీ శబరిష్ ఆధ్వర్యంలో బైక్‌పై మేడారం పరిసర ప్రాంతాల్లో పర్యటించి రహదారుల పరిస్థితిని సమీక్షించారు.లక్షలాది భక్తుల రాకపోకల నేపథ్యంలో ట్రాఫిక్ జామ్‌లు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించాలని, అత్యవసర వాహనాలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ప్రముఖుల రాకపోకల వల్ల భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వాహనాల కదలిక, పార్కింగ్, అత్యవసర సేవలపై సమగ్ర ప్రణాళికతో అన్ని శాఖలు సమన్వయంగా పనిచేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

# మంచిర్యాలలో యూరియా కొరతపై సమీక్ష

మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ కలెక్టర్‌తో రివ్యూ



**మంచిర్యాల, సెప్టెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆధ్వర్యంలో కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లాలో యూరియా కొరత, అభివృద్ధి పనులపై సమగ్రంగా చర్చించారు. యూరియా కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా, డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం క్వాలిటీతో జరుగుతున్నదా అనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల వర్షాలతో జరిగిన పంట నష్టం, పరిహారం పంపిణీపై సమీక్షించారు.గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనుల పురోగతిని అధికారుల నుంచి తెలుసుకున్నారు.

# నేతకాని కమ్యూనిటీ హాల్ విస్తరణకు భూమిపూజ

మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ చేతుల మీదుగా ప్రారంభం



**మంచిర్యాల, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మంచిర్యాల జిల్లా సున్నంబట్టి వాడ 100 ఫీట్ రోడ్‌లో గల నేతకాని సాంస్కృతిక కమ్యూనిటీ హాల్ విస్తరణ పనులకు కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ భూమిపూజ చేశారు. నేతకాని సంఘ సభ్యుల విజ్ఞప్తి మేరకు ఎంపీ వంశీకృష్ణ స్పందించి ఎంపీ లాడ్స్ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధుల కేటాయింపుకు సంఘ నాయకులు, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, “నేతకాని బదులు నేట్కాని అనే స్పెల్లింగ్ తప్పిదం వల్ల కుల సంఘం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించాను. ఎస్సీలకు కాంట్రాక్టులు ఇవ్వాలని అధికారులను కోరాను. కలసి ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుంది” అని పేర్కొన్నారు.మంత్రి వివేక్ మాట్లాడుతూ, “ఎన్నికల హామీ మేరకు నిధులు కేటాయించాం. నేతకాని కుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాం. అసెంబ్లీలో నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు కోసం మాట్లాడాను. చెన్నూరు నియోజకవర్గంలో అధిక నిధులు కేటాయిస్తాను. రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరతాను” అని తెలిపారు.ఈ కార్యక్రమంలో నేతకాని సంఘ నాయకులు, కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రామగుండంలో పాఠశాల గదుల నిర్మాణానికి శంకుస్థాపన

అశోక్ నగర్ బాలికల పాఠశాలలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రారంభం



**రామగుండం, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని అశోక్ నగర్ బాలికల జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ శంకుస్థాపన చేశారు. పెద్దపల్లి నిధులతో సుమారు రూ.100 లక్షల అంచనా వ్యయంతో ఈ నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పాఠశాలల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, మెరుగైన వసతులు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు. విద్యా రంగంలో సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో రామగుండం మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ, మున్సిపల్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థుల కోసం చేపట్టిన ఈ నిర్మాణం స్థానికంగా అభినందనలందుకుంది.

# కరీంనగర్‌లో పాస్‌పోర్ట్ సేవలకు నూతన కేంద్రం

-రోజుకు 500 స్లాట్లకు అవకాశం

- కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఫార్చ్యూన్ మాల్‌లో నూతన భవనంలో సేవలు ప్రారంభించింది. కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. 7 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో విస్తారమైన వేటింగ్ హాలు, చిన్నపిల్లల గది, పార్కింగ్, వీల్‌చైర్ వంటి సౌకర్యాలు కల్పించారు.ప్రస్తుతం రోజుకు 230 స్లాట్లు అందిస్తున్న ఈ కేంద్రం, త్వరలో 500 స్లాట్లకు విస్తరించనుంది. తెలంగాణ రీజనల్ పాస్‌పోర్ట్ అధికారి జొన్నలగడ్డ స్నేహజ కృషితో కేంద్రం వేగంగా అభివృద్ధి చెందిందని మంత్రి ప్రశంసించారు. 2024లో రాష్ట్రవ్యాప్తంగా 9.02 లక్షల దరఖాస్తులు విజయవంతంగా పూర్తయ్యాయి.రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయిస్తే పర్మినెంట్ భవనం నిర్మిస్తామని బండి సంజయ్ తెలిపారు. కరీంనగర్‌ను పాస్‌పోర్ట్ సేవల ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

# సేవా భారతి సేవలు భేష్

మంచిర్యాలలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభం



**మంచిర్యాల, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సేవా భారతి కేంద్రంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. “నేను మూడో తరగతిలోనే ఆర్ఎస్ఎస్ లో చేరాను. సేవాభావం, క్రమశిక్షణ, దేశభక్తి అన్నీ ఆర్ఎస్ఎస్ నుంచే నేర్చుకున్నాను” అని పేర్కొన్నారు. ప్రజలకు నిజమైన సేవలందిస్తూ దేశానికి అద్భుతమైన సేవలు అందిస్తున్న సంస్థ సేవా భారతి అని కొనియాడారు. “సేవ పేరుతో కొందరు మత మార్పిళ్లకు పాల్పడుతున్నారు. కానీ సేవా భారతి మాత్రం బైంసా బాధితులకు ఇండ్లు కట్టించి, నిజమైన సేవను అందించింది” అని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సేవా భారతి ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సేవా భారతి చేస్తున్న కృషిని మంత్రి ప్రశంసించారు.

# ఇంజనీర్లకు లయన్స్ క్లబ్ ఘన సన్మానం

కరీంనగర్ గోల్డెన్ శాతవాహన ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే వేడుకలు



**కరీంనగర్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఇంజనీర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ శాతవాహన ఆధ్వర్యంలో ఇంజనీర్లు జి. వెంకట కిషన్ మరియు లను ఘనంగా సన్మానించారు. నిర్మాణ రంగానికి విశ్వేశ్వరయ్య గారు చేసిన సేవలను గుర్తు చేస్తూ, ఇంజనీరింగ్ రంగాన్ని గౌరవించే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షులు లయన్ ననువాల గిరిధర్ రావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “ఇంజనీర్లు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వారి సేవలను గుర్తించి సన్మానించడం మా బాధ్యతగా భావిస్తున్నాం” అని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఎల్సీఐఎఫ్ కోఆర్డినేటర్ లయన్ మానువాడ శంకర్, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ లయన్ చిలుపూరి రాములు, థర్డ్ వైస్ ప్రెసిడెంట్ లయన్ బండారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహావిష్కరణకు అడ్డంకులు ఎందుకు?

-బహుజన రాజ్యాధికారమే అంబేద్కర్ ఆకాంక్ష: కొప్పుల ఈశ్వర్, పుట్ట మధూకర్

**కమాన్‌పూర్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
“అంబేద్కరిజం, పూలేవాదం ఎప్పటికీ వట్టిగా పోదు. సమాజంలో మార్పు తీసుకురావడమే వీరి లక్ష్యం” అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కమాన్‌పూర్ మండలంలోని పెంచికల్‌పేట్ గ్రామంలో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్, ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇరుగురాల కిష్టయ్యల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్‌తో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, “ఒక మారుమూల గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి 144 సెక్షన్ పెట్టాలనే ఆలోచన



రావడం దారుణం. దేశానికి రాజ్యాంగం అందించిన మహనీయుడిని అవమానించడం సరికాదు. అంబేద్కర్ కేవలం ఎస్సీలకే కాదు, బహుజనులందరికీ రాజ్యాధికారాన్ని కల్పించాలన్నది ఆయన ఆకాంక్ష. ప్రపంచ దేశాలు అంబేద్కర్‌ను మేధావిగా గౌరవిస్తుంటే, మన దేశంలో మాత్రం అడ్డంకులు పెడతారా?” అని ప్రశ్నించారు.మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మాట్లాడుతూ, “అంబేద్కర్‌ను అవమానిస్తే మీ అయ్య నీచ చరిత్రను బయటపెడతా. మా దేవుడి విగ్రహానికి బురకతీసి దండలు వేసిన వాళ్లపై కేసులు పెట్టాలి. అంబేద్కర్ విగ్రహాలు ఒక్క ఎస్సీలకే కాదు, దేశంలో పుట్టిన ప్రతి బిడ్డకు గౌరవించాల్సిన మహనీయుడివి. ఓటు వేసి బానిసవు అవుతావా, ఓటు వేసుకుని రాజువు అవుతావా అన్న సందేశాన్ని ప్రజలు గుర్తించాలి” అని అన్నారు. విగ్రహావిష్కరణకు పోలీసులు ఆంక్షలు పెట్టడాన్ని తీవ్రంగా విమర్శించిన నేతలు, బహుజన వర్గాలకు రాజ్యాధికారాన్ని కల్పించాల్సిందేనని, అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# బొగ్గు విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి డిమాండ్

కోల్ ఇండియా ప్రధాన కార్యాలయం వద్ద నిరసనలు

**రామగుండం, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేశానికి శక్తిని అందించేందుకు జీవితాలను అంకితం చేసిన కోల్ ఇండియా, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల పెన్షన్, వైద్య సదుపాయాల సమస్యల పరిష్కారానికి “ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ అసోసియేషన్” జాతీయ పిలుపు మేరకు కోల్‌కతాలోని కోల్ ఇండియా ప్రధాన కార్యాలయం వద్ద దేశవ్యాప్తంగా భారీ నిరసనలు నిర్వహించారు.ఈ నిరసనకు సంఘీభావంగా హైదరాబాద్‌లోని పోచారం మున్సిపాలిటీ సుప్రభాత్ టౌన్‌షిప్‌లో సింగరేణి విశ్రాంత ఉద్యోగులు బ్లాక్ బ్యాడ్జీలు ధరించి ప్లే కార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప



ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ మాట్లాడుతూ, 1998లో ప్రవేశపెట్టిన పెన్షన్ స్కీమ్ ప్రకారం రూ.350 కనీస పెన్షన్ నిర్ణయించగా, నిరసనలతో రూ.1000కి పెంచినప్పటికీ అది సరిపోవడం లేదన్నారు.పెన్షన్ స్కీమ్‌ను ప్రతి మూడు సంవత్సరాలకు సవరించాలని, పార్లమెంట్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, కరువు భత్యం అనుసంధానం చేయాలని, వేతన ఒప్పందంతో పాటు పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. CMPFO రద్దు చేసి జాతీయ పెన్షన్ ట్రస్ట్ ఏర్పాటు చేయాలని, కార్పొరేట్ లాభాల్లో మూడు శాతం పెన్షన్ ఫండ్‌కు కేటాయించాలని, ఉద్యోగులు – అధికారులకు ఒకే వైద్య విధానం అమలు చేయాలని, హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంగారి రాజయ్య, కె. బీరయ్య, లక్ష్మీనారాయణ, గీస కనకయ్య, పూర్ణ ప్రకాష్, కొట్టే మల్లయ్య, నర్సయ్య, ప్రతాప్ సింగ్ రామరాజు, రఫిక్, ప్రభాకర్ తదితర విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యం

**-బతుకమ్మ -దసరా ఏర్పాట్లపై సమీక్ష చేసిన ఎమ్మెల్యే గండ్ర**



**భూపాలపల్లి, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
విద్యాభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని, ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆకాంక్షించారు. గణపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య మొదటి వేతనం నుంచి వంద మంది విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే విద్యా పథకాల అమలుపై వివరించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి మోరె జగదీశ్వర్‌ను అభినందించారు.అలాగే, రానున్న బతుకమ్మ -దసరా పండుగల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో గ్రామాల్లో పారిశుధ్యం, వీధిలైట్లు, నీటి సరఫరా, భద్రత, ఆరోగ్య సదుపాయాలపై దిశానిర్దేశాలు చేశారు. గొడవలు జరిగే ప్రాంతాల్లో ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్సవాలను ప్రజాస్వామ్య పండుగలా విజయవంతంగా నిర్వహించడమే లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు.

# “విద్యార్థి లోకం బలిపీఠం ఎక్కింది”

**రాష్ట్ర ప్రభుత్వంపై హుజురాబాద్‌లో ఎంపీ ఈటల రాజేందర్ విమర్శలు**



**హుజురాబాద్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
‘25 ఏళ్లుగా ఎన్నో ప్రభుత్వాలు చూశాను, కానీ ఇంత బాధ్యత రాహిత్యం ఎప్పుడూ చూడలేదు” అంటూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. హుజురాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు రూ.9 వేల కోట్లకు చేరాయని, విద్యార్థులు, తల్లిదండ్రులు, కాలేజీలు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్స్‌లో డైట్ చార్జీలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని, మేధాశక్తిని నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కొరతపై మండిపడి, వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. గ్రూప్ -1 పరీక్ష అవకతవకలపై స్పందిస్తూ, “కోర్టే రద్దు చేయమంది, ఇది ప్రభుత్వ నిర్వాకం” అని విమర్శించారు.అవుట్సోర్సింగ్ ఉద్యోగులు, గెస్ట్ లెక్చరర్లు జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, విద్యా వ్యవస్థను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. “ప్రజల గుండెలు మండిపోతున్నాయి, సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వానికి ప్రజల ఆగ్రహం తప్పదు” అని హెచ్చరించారు.

# ప్రజావాణి దరఖాస్తులకు ప్రథమ ప్రాధాన్యత

**పెండింగ్ సమస్యలపై అధికారులకు కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాలు**



**కరీంనగర్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని, 2021 ఫిబ్రవరి నుంచి వచ్చిన 27,580 దరఖాస్తుల్లో 1810 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కోర్టు కేసుల వంటి సమస్యలపై అర్జీదారులకు సమాచారం ఇచ్చి ఆన్లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ‘ఉల్లాస్” కార్యక్రమంలో 69,958 మంది నమోదు చేసి రాష్ట్రంలో కరీంనగర్ జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రజావాణిలో 387 దరఖాస్తులు స్వీకరించి, వాటిని సంబంధిత శాఖలకు బదిలీ చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్, డిఆర్ఓ, ఆర్డీవో పాల్గొన్నారు.

# చొప్పదండి సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కమీషనర్

**-పెండింగ్ కేసులపై సమీక్ష**
**- రికార్డుల నిర్వహణపై సూచనలు**



**కరీంనగర్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పోలీస్ కమిషనర్ శ్రీ గౌష్ ఆలం ఐపీఎస్ చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అండర్ ట్రయల్ కేసుల రికార్డులు, కమిషనరేట్ కంప్లైంట్ సెల్ ద్వారా అందిన ఫిర్యాదుల రిజిస్టర్, నెలవారీ క్రైమ్ రిపోర్టు రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు.పెండింగ్‌లో ఉన్న కేసులపై సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్‌ను అడిగి, వాటి పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. రికార్డుల నిర్వహణలో మరింత శ్రద్ధ వహించాలని, అన్ని వివరాలు సక్రమంగా నమోదు చేయాలని కమిషనర్ సూచించారు.

# అథ్లెటిక్స్ పోటీలకు సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన ఎమ్మెల్యే నాయిని

**జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో అక్టోబర్ 16 -18 తేదీల్లో పోటీలు**



**వరంగల్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, అక్టోబర్ 16, 17, 18 తేదీల్లో జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్న 5వ ఓపెన్ అండర్ -23 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా పోటీల పోస్టర్‌ను సీఎం చేతుల మీదుగా విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, రాష్ట్ర అథ్లెటిక్స్ చైర్మన్ ఎర్రబెల్లి వరద రాజేశ్వర్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, జిల్లా క్రీడా శాఖ అధికారి అశోక్, జాయింట్ సెక్రటరీ సారంగం తదితరులు పాల్గొన్నారు.

# పోషణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

**అవగాహన కార్యక్రమాలపై అధికారులకు సూచనలు**



**కరీంనగర్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: ఈనెల 17 నుంచి వచ్చే నెల 16 వరకు జిల్లాలో నిర్వహించనున్న పోషణ మాసోత్సవాలను విజయవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. మహిళాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో పోషకాహారంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## హుస్నాబాద్‌ను కరీంనగర్‌లో కలపాలంటూ బీజేపీ రాస్తారోకో

**ప్రభుత్వ హామీ అమలు చేయలేదని ఆగ్రహం**



**హుస్నాబాద్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ పట్టణాన్ని కరీంనగర్ జిల్లాలో కలుపుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. గత ఎమ్మెల్యే మాట తప్పినట్టు, ప్రస్తుత ఎమ్మెల్యే కూడా ప్రజల నమ్మకాన్ని వంచించారని నాయకులు విమర్శించారు.ఈ నిరసన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్యా సంపత్ నాయక్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బొమ్మగాని సతీష్, మాజీ మండల అధ్యక్షుడు వెల్దండి రాజేంద్రప్రసాద్, పలువురు పార్టీ సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు, టౌన్ నాయకులు పాల్గొన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# మెడికల్ విద్యార్థులకు బస్సు

**- బండి సంజయ్ చొరవ**
**-కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి రవాణా సౌకర్యం**



**కరీంనగర్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థుల రవాణా సమస్యకు కేంద్ర మంత్రి బండి సంజయ్ ముగింపు పలికారు. ఎంపీ లాడ్స్ నిధులతో పాటు దాతల సహకారంతో బస్సును అందజేశారు. ఎంపీ కార్యాలయం వద్ద బస్సుకు పూజలు నిర్వహించి, విద్యార్థులతో కలిసి కొద్దిదూరం ప్రయాణించారు.విద్యార్థుల హాస్టళ్లు వేర్వేరు ప్రాంతాల్లో ఉండటంతో తరగతులకు చేరేందుకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో, విద్యార్థుల మొరపై స్పందించిన మంత్రి బస్సు అందించారు. కాలేజీలో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు ఆర్వో ప్లాంట్లు, విద్యుత్ సమస్యకు జనరేటర్, అలాగే మెరుగైన భవనంలోకి తరలింపు కోసం అవసరమైన వ్యయాన్ని భరిస్తానని హామీ ఇచ్చారు.కేంద్ర మంత్రికి విద్యార్థులు, అధ్యాపకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. “మా కష్టాలను గుర్తించి స్పందించిన బండి సంజయ్ గారు నిజంగా ఆదర్శ నాయకులు” అని ప్రశంసించారు.

# బంగ్లపల్లిలో వ్యవసాయ రహదారికి శంకుస్థాపన

**ఎస్టీ ఎస్డీఎఫ్ నిధులతో రూ.57.50 లక్షల వ్యయంతో పనులు ప్రారంభం**



**భూపాలపల్లి, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భూపాలపల్లి నియోజకవర్గం మొగుళ్ళపల్లి మండలం బంగ్లపల్లి గ్రామంలో వ్యవసాయ పొలాలకు వెళ్లే రహదారి నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఎస్టీ ఎస్డీఎఫ్ నిధుల ద్వారా రూ.57.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై టెంకాయ కొట్టి ప్రారంభించారు.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు రవాణా సౌకర్యం కల్పించేందుకు ఈ రహదారి ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

# రామడుగులో ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రైతు వేదికలో వేడుకలు**



**రామడుగు, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామడుగు మండల రైతు వేదికలో నిర్వహించిన వేడుకల్లో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా పాల్గొని ఉపాధ్యాయులకు ప్రశంసాపూర్వకంగా సన్మానం చేశారు.వేడుకల్లో మండల విద్యాధికారి రంగనాథ శర్మ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఒంటెల మురళీకృష్ణ రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ గోపాల్ రావు, బొమ్మర వేణి, తిరుమల తిరుపతి, మండల అభివృద్ధి అధికారి సంఘీ రాజేశ్వరి పాల్గొన్నారు. అలాగే ఎస్జీటీయూ జిల్లా నాయకులు ఊకంటి విజేందర్ రెడ్డి, వివిధ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారికి గౌరవం కల్పించిన ఈ కార్యక్రమం విద్యా రంగానికి ప్రేరణగా నిలిచింది.

## బతుకమ్మ -దసరా ఉత్సవాలకు వైభవంగా ఏర్పాట్లు చేయాలి

**కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్**



**కరీంనగర్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాబోయే బతుకమ్మ మరియు విజయదశమి పండుగలను పురస్కరించుకొని నగరంలోని ప్రధాన కూడళ్లను రంగురంగుల లైట్లతో అలంకరించాలని, మార్కెండ్ గ్రౌండ్, అంబేద్కర్ స్టేడియంలో గతంలా ఘనంగా ఉత్సవాలు నిర్వహించాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సూచించారు. లైటింగ్, సౌండ్ సిస్టం, రామ్ లీలా వేదిక ఏర్పాట్లపై కమిషనర్ ప్రపోల్ దేశాయ్‌ను మాజీ కార్పొరేటర్లు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి కోరారు.బతుకమ్మ ఉత్సవాలకు దశాబ్దాల నుంచి కొనసాగుతున్న ఆనవాయితీని మరింత వైభవంగా నిర్వహించాలని, బతుకమ్మ ఘాట్ల వద్ద సరైన లైటింగ్, రంగురంగుల ముగ్గులు, మానేరు రిజర్వాయర్‌లో నిమజ్జన సమయంలో రక్షణ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సూచించారు.

# దేవరకొండ దర్గా భూములపై దౌర్జన్యం

**– ఆక్రమణదారుల కబంధ హస్తాల్లో ఇనాం భూములు.**



**దేవరకొండ సెప్టెంబర్ 15. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా దేవరకొండలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, హాజ్ రత్ సయ్యద్ సులేమాన్ షావలి ఖాద్రి దర్గా అనేక ఏళ్లుగా భక్తుల పాలిట ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న ఈ దర్గాకు చెందిన ఇనాం భూములు ఇప్పుడు కబ్జాదారుల బారిన పడి దౌర్జన్యాలకు గురవుతున్నాయి. దర్గా కు చెందిన ఈ విలువైన భూములను పట్టణానికి చెందిన కొంతమంది బడా బాబులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా ఆక్రమించుకుంటున్నారు. దర్గాకు చెందిన భూములు దేవరకొండ పట్టణం మధ్యలో అత్యంత వ్యూహాత్మకమైన ప్రాంతాలలో ఉన్నాయి. ఈ భూముల విలువ లక్షలలో ఉండడంతో అక్రమార్కుల కన్ను వాటిపై పడింది. దర్గా కమిటీకి, ముతావలిలకు తెలియకుండానే రాత్రికి రాత్రే స్థలాలు చదును చేయడం కంచెలు వేయడం కొన్ని చోట్ల ఏకంగా నిర్మాణాలు చేపట్టడం లాంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. ఈ అక్రమాలకు స్థానిక రాజకీయ నాయకుల అండదండలు కూడా ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.
దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న దర్గా ముతావలిలు భూములను కాపాడాలని ఉన్నతాధికారులను, ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఇప్పటికే చాలా వరకు భూములు అన్యాక్రాంతం అయ్యాయని మిగిలిన భూములనైనా కాపాడాలని దర్గా భక్తులు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దర్గా భూముల ఆక్రమణలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని దర్గాకు చెందిన భూములను దర్గా కమిటీకి తిరిగి అప్పగించాలని స్థానికీలు కోరుతున్నారు. ఈ దౌర్జన్యాలపై ప్రభుత్వం స్పందించి చారిత్రక మతపరమైన ప్రాముఖ్యత కలిగిన ఈ పుణ్యక్షేత్రాన్ని, దాని ఆస్తులను కాపాడుతుందా అనేది ఇప్పుడు చూడాలి. ఈ కార్యక్రమంలో దర్గా ముతావలిలు సయ్యద్ బాబా అహ్మద్, సయ్యద్ అంజాత్,సయ్యద్ సిద్దిక్, సయ్యద్ సాబేర్,సయ్యద్ ఖజా పషా, సయ్యద్ అలీ లు ఉన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం: సిపిఐ



**వనపర్తి సెప్టెంబర్ 15( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
ప్రజా సమస్యలను పారదర్శకంగా పరిష్కరించకపోతే పోరాటం చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి కే విజయరాములు అన్నారు. సోమవారం వనపర్తి ఆఫీసులో పృథ్వీనాదం అధ్యక్షతన వనపర్తి పట్టణ కౌన్సిల్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ..ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఎంపికలో లోపాలు ఉన్నాయని, అర్హులైన పేదలకు అందటం లేదన్నారు. జిల్లాలో రైతులకు యూరియా ఎరువులు అందక గోస పడుతున్నారనితగినంత యూరియా అందించాలన్నారు. యూరియా సరఫరా లో వైఫల్యాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెట్టుకొని బాధ్యతలు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. రైతులు క్యూలో గంటల తరబడి నిలబడి ఆకలి దప్పులకు అల్లాడుతున్నారని అయినా ప్రభుత్వం చెల్లించటం లేదన్నారు. కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన యూరియా కోట మొత్తాన్ని వెంటనే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. సెప్టెంబర్ 17 న తెలంగాణ సాయుధ రత్తంగా పోరాట వారోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు పట్టణ కన్వీనర్ జయమ్మ, పట్టణ మాజీ సహాయ కార్యదర్శి ఎర్రకురుమయ్య, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు పృథ్వీనాదం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## చామనపల్లిలో ఘనంగా కళా ఉత్సవం -2025 పోటీలు

**విద్యార్థుల ప్రతిభకు వేదికగా రైతు వేదిక**




**కరీంనగర్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా విద్యాధికారి పాఠశాల విద్యా శాఖ ఆదేశాల మేరకు కరీంనగర్ రూరల్ మండల స్థాయిలో కళా ఉత్సవం-2025 పోటీలు చామనపల్లి రైతు వేదికలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి కాసుల రవీందర్ అధ్యక్షత వహించారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థుల కోసం పాటలు, నృత్యం, చిత్రలేఖనం, విజువల్ ఆర్ట్ (2D, 3D), సంప్రదాయ కథలు, థియేటర్ గ్రూప్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళా నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహించామని ఎంఈఓ తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ చామనపల్లి ప్రధానోపాధ్యాయురాలు వాసవి, ఉపాధ్యాయ బృందం, ఎంఆర్సీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కళా ప్రదర్శనలతో వేదిక కళాత్మకంగా మారింది.

# వక్ఫ్ చట్టానికి పాక్షికంగా బ్రేక్..

**వివాదాస్పద నిబంధనలపై స్టే విధించిన సుప్రీంకోర్టు**
**ఐదేళ్లపాటు ఇస్లాం పాటించాలన్న నిబంధన నిలిపివేత**
**వక్ఫ్ ఆస్తిలో కలెక్టర్ల జోక్యం నిలుపుదల**

**న్యూఢిల్లీ, -సెప్టెంబర్ 15( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
కొత్తగా తీసుకొచ్చిన వక్ఫ్(సవరణ) చట్టం, 2025 చట్టబద్ధతను సవాలు చేసిన పిటిషనర్లకు సుప్రీంకోర్టులో పాక్షిక ఉపశమనం లభించింది. వక్ఫ్ చట్టంలోని కొన్ని వివాదాస్పద నిబంధనలపై సుప్రీంకోర్టు సోమవారం స్టే ఇచ్చింది. వక్ఫ్ బోర్డులో ఎవరు సభ్యులుగా ఉండాలన్న అంశంపై సిఫార్సు చేయడంతోపాటు వక్ఫ్‌ను ఎవరు సృష్టించవచ్చు, ఆక్రమణలకు చెందిన వివాదాలను ఎవరు పరిష్కరించాలన్న అంశాలకు సంబంధించిన నిబంధనలను సుప్రీంకోర్టు నిలిపివేసింది. వక్ఫ్ చట్టంపై మొత్తంగా స్టే విధించాల్సిన అవసరం ప్రస్తుతం న్యాయస్థానానికి కనిపించడం లేదని, కొత్త చట్టంలో రాజ్యాంగపరమైన సవాళ్లకు సంబంధించి




విస్తృత స్థాయిలో విచారణ జరుపుతామని సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది. మొత్తం చట్టాన్నే పిటిషనర్లు సవాలు చేశారని, అయితే మౌలికంగా చట్టంలోని 3(ఆర్), 3సీ, 14 సెక్షన్లను పిటిషనర్లు సవాలు చేశారని ధర్మాసనం తెలిపింది. సవాలు చేసిన సెక్షన్లపై తాము స్టే ఇస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. వక్ఫ్‌ను సృష్టించే వ్యక్తి ఐదేళ్ల పాటు ఇస్లాం మతాన్ని తప్పనిసరిగా పాటించాలన్న నిబంధనను(సెక్షన్ 3(ఆర్) నిలిపివేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఇస్లాంను ఆచరిస్తున్న వ్యక్తిని నిర్ధారించడానికి నిబంధనలు రూపొందించే వరకు ఈ సెక్షన్‌పై స్టే విధిస్తున్నట్లు కోర్టు పేర్కొంది. వక్ఫ్ ఆస్తిగా ప్రకటించిన ఆస్తి ప్రభుత్వ ఆస్తి అవునా కాదా అన్న విషయాన్ని నిర్ధారించి ఉత్తర్వులు జారీ చేసే అధికారాన్ని కలెక్టర్‌కు అప్పగిస్తూ చట్టంలో పొందుపరిచిన నిబంధనపై(సెక్షన్ 3సీ(4)) కూడా ధర్మాసనం స్టే విధించింది.
వక్ఫ్ ఆస్తిగా ప్రకటించిన ఆస్తి ఆక్రమణ ద్వారా జరిగిందీ లేనిదీ నిర్ధారిస్తూ ప్రభుత్వం నియమించిన అధికారి నివేదికను సమర్పించే వరకు వక్ఫ్ ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరాదన్న నిబంధనపై(సెక్షన్ 3సీ(2) కూడా కోర్టు స్టే ఇచ్చింది. వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతర సభ్యులను చేర్చాలన్న నిబంధనపై(సెక్షన్ 9,14) స్టే ఇవ్వడానికి కోర్టు నిరాకరించింది. రాష్ట్ర వక్ఫ్ బోర్డులలో ముగ్గురికి మించి ముస్లిమేతర సభ్యులను నియమించరాదని, వక్ఫ్ కౌన్సిళ్లలో నలుగురికి మించి ముస్లిమేతర సభ్యులను నియమించరాదని ధర్మాసనం స్పష్టం చేసింది..

## ఇజ్రాయిల్ దాడులకు 25 మంది పాలస్తీనియన్లు మృతి

**గాజా సెప్టెంబర్ 15( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
సోమవారం ఉదయం ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడిలో ఆరేళ్ల కవలపిల్లలతో సహా 25 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. ఇక నిన్న నివాస భవనాలపై జరిపిన బాంబు దాడిలో కనీసం 16 బహుళ అంతస్తుల భవనాలు విధ్వంసమయ్యాయి. ఈ దాడి వల్ల 53 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. కాగా, అక్టోబర్ 7 2023 నుండి ప్రారంభమైన



దాడుల వల్ల 64,871 మంది మృతి చెందారు. 164,610 మంది గాయాలపాలయ్యారు. ఇదిలా ఉండగా.. ఐక్యరాజ్యసమితితో సహా పలు దేశాలు ఇజ్రాయిల్.. పాలస్తీనాపై దాడుల్ని ఆపాలని పిలుపునిచ్చాయి. అయినప్పటికీ ఇజ్రాయిల్ దాడుల్ని కొనసాగిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయిల్‌తో సంబంధాలు తెంచుకోవాలని ముస్లిం దేశాలను ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ కోరారు.

## లోయర్ మానేరు డ్యామ్ పరిశీలించిన మంత్రి పొన్నం

**–ప్రాజెక్టుల నిండుదనంతో వ్యవసాయానికి ఊపిరి**



**కరీంనగర్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
లోయర్ మానేరు డ్యామ్‌ను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రస్తుత ఇన్‌ఫ్లో వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో విస్తృతంగా వర్షాలు కురవడంతో గోదావరి, కృష్ణ బేసిన్‌లోని అన్ని ప్రాజెక్టులు నిండు కుండలుగా మారాయని తెలిపారు. చెరువులు, జలాశయాలు జలకళ సంతరించుకోవడంతో వ్యవసాయం, మత్స్య పరిశ్రమ మరింత వృద్ధి చెందుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## "విద్యార్థుల జీవితాలతో చెలగాటం"

**–ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలపై బీఎస్పీ ఆగ్రహం**




**హుస్నాబాద్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రంలో 8,500 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఎస్పీ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 6,000 కోట్లు, ప్రస్తుత ప్రభుత్వం 2,500 కోట్ల బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీలు నిరవధిక బంద్‌కు వెళ్లిన నేపథ్యంలో ల్యాబ్, ఫార్మసీ పరీక్షలు వాయిదా పడ్డాయని, ఫీజు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని తెలిపారు. విద్యార్థులు చదువు మధ్యలోనే మానేసి ప్రైవేట్ ఉద్యోగాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బకాయిలు చెల్లించాలని బీఎస్పీ డిమాండ్ చేసింది. ఈ ప్రెస్‌మీట్‌లో మారేపల్లి సుధాకర్, ఎలగందుల శంకర్, జేరిపోతుల రాజు, వెలుపల రాజు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరతపై గోపాలపూర్ చౌరస్తాలో రాస్తారోకో

**–రైతులతో కలిసి ఆందోళనకు దిగిన ఎమ్మెల్యే గంగుల**



**కరీంనగర్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ రూరల్ మండలం గోపాలపూర్ చౌరస్తా వద్ద యూరియా కొరతపై రైతులు, మహిళలు, బీఆర్ఎస్ నాయకులు కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆందోళనలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసినప్పటికీ యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం తక్షణమే సరఫరా మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.

## హుస్నాబాద్ పోస్టాఫీసులో రైలు టికెట్ బుకింగ్ కేంద్రాన్ని పునరుద్ధరించాలి

**–కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ**

**హుస్నాబాద్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామీణ ప్రజలకు రైలు టికెట్ బుకింగ్ సౌకర్యం అందించేందుకు హుస్నాబాద్ సబ్–పోస్టాఫీసులో గతంలో అందుబాటులో ఉన్న ఇండియన్ పోస్టల్ రైల్వే రిజర్వేషన్ సిస్టమ్ సేవను తిరిగి ప్రారంభించాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు లేఖ రాశారు. సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సులభంగా, పారదర్శకంగా రైలు టికెట్లు బుక్ చేసుకునే అవకాశం కల్పించే ఈ కేంద్రాన్ని పోస్టల్ శాఖ మూసివేయడంతో రైతులు, కార్మికులు, విద్యార్థులు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని మంత్రి పేర్కొన్నారు. హుస్నాబాద్ పరిసర గ్రామాల ప్రజలు ఈ కేంద్రాన్ని తిరిగి ప్రారంభించాలని కోరుతున్నారని, ప్రజా అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ, పోస్టల్ శాఖ అధికారులతో చర్చించి ఐపీఆర్ఆర్ఎస్ సేవను పునరుద్ధరించాలని మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు.

# బిజినెస్

# బంగారం కొనేవారికి గుడ్‌న్యూస్.. రికార్డుస్థాయి నుంచి తగ్గిన ధర..!

బంగారం ధరలు కొనుగోలుదారులకు స్వల్ప ఊరట ఇచ్చాయి. ఇటీవల వరుసగా ధరలు పైపైకి కదులుతూ సరికొత్త గరిష్ఠాలను తాకాయి. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో బంగారం రూ.500 తగ్గింది. 24 క్యారెట్ల పసిడి రూ.1,13,300కి చేరింది. దాంతో వరుస నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్ పడినట్లయ్యింది. అదే సమయంలో 24 క్యారెట్ల బంగారం ధర సైతం రూ.500 తగ్గి తులం ధర రూ.1,13,800కి తగ్గింది. మరో వైపు వెండి రూ.300 పెరిగి కిలోకు రూ.1,32,300కి చేరుకుందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. పెట్టుబడిదారులు ఆసక్తి చూపిస్తుండడంతో వెండి ధర పెరుగుతూ వస్తుందని బులియన్ వ్యాపారులు పేర్కొన్నారు. బలహీనమైన యూఎస్ లేబర్ మార్కెట్ డేటా తర్వాత పెట్టుబడిదారులు ద్రవ్య పరపతి విధానంపై దృష్టి



సారించారు.ప్రస్తుతం క్యాలెండర్ సంవత్సరంలో వెండి ధరలు కిలోకు రూ.22,600 పెరిగింది. గత సంవత్సరం డిసెంబర్ 31న వెండి కిలోకు రూ.89,700 వద్ద కొనసాగింది. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ మాట్లాడుతూ సోమవారం బంగారం తక్కువగా ట్రేడ్ అయ్యిందని.. వ్యాపారులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమావేశానికి ముందు కొనుగోళ్లు తగ్గడంతో మధ్యస్తంగా బేరిష్ జోన్‌లో ట్రేడవుతుందన్నారు. ఫెడ్ రిజర్వ్ సమావేశం 16న మొదలై.. 17న ముగియనున్నది. అదే రోజున విధాన నిర్ణయం ప్రకటించనున్నది. చైర్మన్ జెరోమ్ పావెల్ విలేకరుల సమావేశం నిర్వహించనున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫెడ్ అధికారుల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య ఫెడ్ రిజర్వ్ భేటీ ప్రాధాన్యం సంతరించుకున్నది. ప్రపంచ మార్కెట్లలో బంగారం ఔన్సుకు స్వల్పంగా 3,645.12 డాలర్లకు చేరుకుంది. వెండి ఔన్సుకు 42.20 డాలర్ల వద్ద కొనసాగుతున్నది.

## వాహన ఉత్పత్తిలో తగ్గుదల

### ఆగస్టు విక్రయాల్లో 9 శాతం తగ్గుదల



న్యూఢిల్లీ

వాహనాల ఉత్పత్తిలో తగ్గుదల చోటు చేసుకుంది. ఈ ఏడాది ఆగస్టులో నెలలో ప్యాసింజర్ వాహనాల ఉత్పత్తిలో 4.1 శాతం తగ్గుదల చోటు చేసుకున్నట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు తయారీదారులు డీలర్లకు పంపిన డెలివరీలు దాదాపు 9 శాతం తగ్గాయి. వాహనాలపై జిఎస్‌టిని తగ్గించనున్నామని కేంద్రం ప్రకటించిన తర్వాత ఒక్కసారిగా అమ్మకాలు తగ్గాయి. ధరల తగ్గింపు ఆశతో వినియోగదారులు కొనుగోలు నిర్ణయాలను వాయిదా వేసుకుంటున్నారని.. దీంతో అనేక డీలర్‌షిప్‌లలో రిటైల్ అమ్మకాలు దెబ్బతిన్నాయని ఆ వర్గాలు తెలిపాయి. దీంతో ఆగస్టు చివరి నాటికి కార్ల ఇన్వెంటరీ నిల్వలు 60 రోజులకు చేరుకున్నాయి. మొత్తం ఛానల్ ఇన్వెంటరీ దాదాపు 6,00,000 యూనిట్లకు చేరింది. దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి డెలివరీలు 8 శాతం తగ్గాయి. ఎంఅండ్ఎం 9 శాతం కంటే ఎక్కువ, హ్యుందారు మోటార్ ఇండియా డిస్పాచ్‌లు సుమారు 10 శాతం తగ్గాయి.'గడిచిన ఆగస్టులో ప్యాసింజర్ వెహికల్ అమ్మకాలు గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 8.8 శాతం తగ్గి 3,22,000 యూనిట్లకు చేరాయి. మొత్తం ప్రయాణికుల వాహనాల ఉత్పత్తి 4 శాతం తగ్గి 1,25,000 యూనిట్లకు పరిమితమయ్యాయి." అనిసొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియోమ్) డైరెక్టర్ జనరల్ రాజేష్ మీనన్ పేర్కొన్నారు. ద్వి, త్రిచక్ర వాహన అమ్మకాలు 7.1 శాతం పెరిగి 18.3 లక్షల యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. స్కూటర్ అమ్మకాలు 12.7 శాతం, మోటార్‌సైకిళ్లు 4.3 శాతం చొప్పున పెరిగాయి. సియోమ్ గణాంకాల ప్రకారం.. ఆథర్ డిస్పాచ్‌లు దాదాపు 70 శాతం పెరిగి 22,757 యూనిట్లకు చేరాయి. హీరో మోటోకార్ప్ 5.4 శాతం వృద్ధిని నమోదు చేయగా..రాయల్ ఎన్‌ఫీల్డ్ డిస్పాచ్‌లు 56 శాతం పెరిగాయి. గడిచిన ఆగస్టులో మూడు చక్రాల వాహనాల అమ్మకాలు 8.3 శాతం పెరిగి 76,000 యూనిట్లకు చేరాయి.

## స్విగ్గీ నుంచి కొత్త ఫుడ్ డెలివరీ




న్యూఢిల్లీ

ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ ప్రత్యేక డెలివరీ యాప్ 'టోయింగ్' పేరిట కొత్త యాప్‌ను ఆవిష్కరించింది. తొలుత పూణెలో అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌ను విద్యార్థులు, యువత ఎక్కువగా ఉన్న ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని తెచ్చిందని తెలుస్తోంది. ఇందులో రూ.100-150కే ఆహారాన్ని అందించనుంది. కస్టమర్ల నుంచి సర్జ్ ఫీజు వసూలు చేయడం లేదని ఆ సంస్థ పేర్కొంది.

## న్యూమెరోస్ మోటార్స్ నుంచి డిప్లోస్ మాక్స్ ప్లస్ విడుదల



బెంగళూరు

విద్యుత్ వాహనాల తయారీ కంపెనీ న్యూమెరోస్ మోటార్స్ కొత్తగా డిప్లోస్ మ్యాక్స్ ప్లస్‌ను విడుదల చేసినట్లు వెల్లడించింది. డిప్లోస్ మాక్స్‌ంలో 4కిలోవాట్ డ్యూయల్ లిక్విడ్ ఇమర్షన్ కూల్డ్ బ్యాటరీ, 156 కి.మీ రేంజ్, గంటలకు 70 కిలోమీటర్ల టాప్ స్పీడ్‌తో ప్రయాణించగలదని ఆ కంపెనీ పేర్కొంది. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.1.21 లక్షలుగా నిర్ణయించింది.

---

# స్పోర్ట్స్

## షేక్‌హ్యాండ్ ఇవ్వని టీమిండియా క్రికెటర్లు.. నిరసన వ్యక్తం చేసిన పాకిస్థాన్

దుబాయ్

ఆసియాకప్‌లో భాగంగా ఆదివారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇండియా ఏడు వికెట్ల తేడాతో సునాయాస విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే పెహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ ఘటన తర్వాత రెండు దాయాది దేశాలు తలపడ్డాయి. ఈ నేపథ్యంలో భారత క్రికెటర్లు .. పాకిస్థాన్ క్రికెటర్లతో కరచాలనం చేసేందుకు నిరాసక్తత ప్రదర్శించారు. దీన్ని పాకిస్థాన్ జట్టు ఖండించింది. ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ ముందు తన నిరసన వ్యక్తం చేసింది. ఆదివారం రాత్రి ఆలస్యంగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు దీనిపై ప్రకటన రిలీజ్ చేసింది. టీమిండియా చర్యలు క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ఉన ్నట్లు పీసీబీ ఆ స్టేట్మెంట్‌లో చెప్పింది.ఆదివారం దుబాయ్‌లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసు కున్నాయి. భారత్, పాక్ కెప్టెన్లు టాస్ సమయంలో షేక్‌హ్యాండ్ ఇచ్చుకోలేదు. సూర్యకుమార్ యాదవ్, సల్మాన్ ఆఘాలు.. క రచాలనం చేయకుండానే టాస్‌లో పాల్గొని వెళ్లిపోయారు. ఇక మ్యాచ్ ముగిసిన తర్వాత టీమిండియా క్రికెటర్లు సైలెంట్‌గా డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లిపోయారు. టార్గెట్ 128 చేసే క్రమంలో



భారీ సిక్సర్‌తో సూర్య ఇన్నింగ్స్ ముగించేశాడు. మ్యాచ్ గెలిచిన తర్వాత సాధారణంగా ప్రత్యర్థి జట్ల ప్లేయర్లకు షేక్‌హ్యాండ్ ఇస్తారు. కానీ సూర్య, దూబేలు.. పాక్ క్రికెటర్లకు షేక్‌హ్యాండ్ ఇవ్వకుండానే వెళ్లిపోయారు. గెలిచిన, ఓడిన జట్ల ప్లేయర్లు షేక్‌హ్యాండ్ ఇచ్చుకోలేదు.భారత క్రికెటర్లు ప్రవర్తించిన తీరు పట్ల పాకిస్థాన్ టీమ్ మేనేజర్ నవీద్ చీమా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇది క్రీడా స్ఫూర్తికి విరుద్ధం అని ఆయన అన్నారు. నిరసనలో భాగంగా తమ కెప్టెన్ను పోస్టు మ్యాచ్ సెర్మనీకి పంపలేదని ఆయన స్టేట్మెంట్‌లో తెలిపారు.పాకిస్థాన్ క్రికెటర్లకు షేక్‌హ్యాండ్ ఇవ్వకపోవడం పట్ల మ్యాచ్ తర్వాత సూర్యకుమార్ స్పందించారు. పెహల్గామ్ ఉగ్రదాడి ఘటనలో మృతిచెందిన కుటుంబాలకు సంఘీభావం తెలుపుతున్నట్లు ప్రకటించారు.

## ఆర్సీబీ కెప్టెన్ ఖాతాలో రెండో ట్రోఫీ..

### 11 ఏళ్లకు ఛాంపియన్‌గా సెంట్రల్ జోన్..!



ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ట్రోఫీ అందించిన రజత్ పాటిదార్ మరో టైటిల్ గెలుపొందాడు. అతడి సారథ్యంలోని సెంట్రల్ జోన్ జట్టు దులీప్ ట్రోఫీలో విజేతగా నిలిచింది. దాదాపు 11 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ టైటిల్‌ను ముద్దాడింది ఆ జట్టు. ఐదు రోజుల పాటు హోరాహోరీగా సాగిన ఫైనల్లో సౌత్ జోన్ పై 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలి ఇన్నింగ్స్‌లో సూపర్ సెంచరీతో జట్టుకు భారీ స్కోర్ అందించిన పాటిదార్.. తన మార్క్ కెప్టెన్సీతో సెంట్రల్ కలను సాకారం చేశాడు.బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానంలో జరిగిన దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్ ఉత్కంఠ విజయంతో మురిసింది. ఒకదశలో ఓటమి అంచున నిలిచిన ఆ జట్టు.. చిరస్మరణీయ విక్టరీ సాధించింది. సౌత్ జోన్ నిర్దేశించిన 65 పరుగుల లక్ష్య ఛేదనలో సెంట్రల్ జట్టు టాపార్డర్ విఫలమైంది. గుర్జప్‌నీత్ సింగ్, అంకిత్ కుమార్ విజృంభణతో 24 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.ఆ పరిస్థితుల్లో మరో రెండు వికెట్లు పడితే సౌత్ జోన్ ఛాంపియన్ అయ్యేది. కానీ, అక్షయ్ వద్కర్(19 నాటౌట్), యశ్ రాథోడ్ (13 నాటౌట్)లు అద్భుతంగా ఆడి ప్రత్యర్థి ఆశలపై నీళ్లు చల్లారు. ఈ ఇద్దరూ కీలక ఇన్నింగ్స్ ఆడగా ఆరు వికెట్లతో జయభేరి మోగించింది సెంట్రల్. తద్వారా 11 ఏళ్ల తర్వాత దులీప్ ట్రోఫీ కలను సాకారం చేసుకుంది.

**యశ్, పాటిదార్ శతక గర్జన**

తొలి ఇన్నింగ్స్‌లో సౌత్ జోన్ బ్యాటర్లు చేతులెత్తేశారు. సెంట్రల్ బౌలర్లు సరన్ష్ జైన్(5-49), కుమార్ కార్తికేయ(4-53) ధాటికి ఆ జట్టు 149 పరుగులకే ఆలౌటయ్యింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన సెంట్రల్‌కు ఓపెనర్ డానిష్ మలేవర్(53) శుభారంభమిచ్చాడు. అనంతరం యశ్ రాథోడ్ (194), కెప్టెన్ రజత్ పాటిదార్(101)లు సౌత్ జోన్ బౌలర్లను ఉతికారేస్తూ సెంచరీలతో చెలరేగారు.యశ్, పాటిదార్ విధ్వంసంతో సెంట్రల్ జట్టు 511 పరుగులతో భారీ ఆధిక్యం సాధించింది. అయితే.. రెండో ఇన్నింగ్స్‌లో సౌత్ బ్యాటర్లు అసమానంగా ఆడారు. అంకిత్ శర్మ(99), అంద్రే సిద్దార్థ్ (84), స్మరణ్ రవిచంద్రన్ (67)లు అర్ధ శతకాలతో విజృంభించారు. దాంతో.. 426 రన్స్ చేసిన సౌత్ ప్రత్యర్థికి 65 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

## ఓవల్ టెస్టులో చిరస్మరణీయ బౌలింగ్..

### సిరాజ్‌ను వరించిన ఐసీసీ అవార్డు

ఇంగ్లండ్ పర్యటనలో సంచలన బౌలింగ్‌తో మ్యాచ్ విన్నర్‌గా అవతరించిన మహమ్మద్ సిరాజ్ ఐసీసీ అవార్డుకు ఎంపికయ్యాడు. అండర్సన్ - టెండూల్కర్ ట్రోఫీలో చివరిదైన ఓవల్ టెస్టు లో సంచలన బౌలింగ్‌కుగానూ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డు అందుకున్నాడీ స్పీడ్‌స్టర్. ఆగస్టు నెలకుగానూ అతడికి ఈ గౌరవం లభించింది. ఈ అవార్డు కోసం మ్యాట్ హెన్రీ(న్యూజిలాండ్), జైడెన్ సీల్స్ (వెస్టిండీస్) పోటీపడగా.. అత్యధిక ఓట్లతో భారత పేస్ గన్ విజేతగా నిలిచాడు.'నాకంటే జట్టులోని సహచరులకు, సహాయక సిబ్బందికి ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు చెందుతుంది. వారి నిరంతరం ప్రోత్సాహం, నాపై వాళ్లకున్న నమ్మకమే నన్ను ముందుకు నడిపిస్తోంది. ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటింగ్ లైనప్‌లోని ఆటగాళ్లకు వాళ్ల సొంత గడ్డపైనే బౌలింగ్ చేయడం సవాల్‌గా తోచింది. ఒకరకంగా నాలో ఉత్తమ ప్రదర్శన వెలుగులోకి రావడానికి కారణం' అదే అని సిరాజ్ వెల్లడించాడు.




**బుమ్రా గైర్హాజరీలో**

ఇంగ్లండ్ పర్యటనలో ఐదుకు ఐదు మ్యాచ్‌లు ఆడిన సిరాజ్.. ఏకంగా 185.3 ఓవర్లు బౌలింగ్ చేసి అందర్నీ ఆశ్చర్చపరిచాడు. తన ఫిట్‌నెస్‌తో పాటు చెక్కుచెదరని ఏకాగ్రతతో అందరి ప్రశంసలు అందుకున్న మియా భాయ్.. నిర్ణయాత్మక ఓవల్ టెస్టులో నిప్పులు చెరిగాడు. బుమ్రా గైర్హాజరీలో పేస్ దళం బాధ్యతలను భుజాన వేసుకున్న అతడు తొలి ఇన్నింగ్స్‌లో 5, రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు.. మొత్తంగా 9 వికెట్లు పడగొట్టాడు.తద్వారా భారత్‌కు చిరస్మరణీయ విజయంలో కీలకపాత్ర పోషించాడీ హైదరాబాదీ పేసర్. దాంతో, శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా 2-2తో సిరీస్ సమం చేసి ఇంగ్లండ్‌కు షాకిచ్చింది. ఐదు టెస్టుల్లో కలిపి 23 వికెట్లు తీసిన సిరాజ్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గెలుచుకున్నాడు.